


# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 03 ఆగస్టు 2021 సంపుటి : 03 సంచిక :01 పేజీలు : 4 వెల : రూ 3-00


## కృష్ణా నదీ జలాల వివాదంపై సీజేఐ కీలక వ్యాఖ్యలు!



న్యూఢిల్లీ : కృష్ణా నదీ జలాల వివాదంపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. అయితే, ఏపీ పిటిషన్‌పై విచారణ అవసరం లేదని.. ఈ విషయంలో ఇప్పటికే కేంద్రం గెజిట్ జారీ చేసిందని తెలంగాణ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అక్టోబర్ నుంచి గెజిట్ అమలులోకి వస్తుందని తెలిపిన ఏపీ.. ఇప్పటి నుంచే గెజిట్ అమలు చేయాలని కోరుతున్నామని వాదించింది. నాలుగు నెలల పాటు నీటిని నష్టపోకూడదనే అడుగుతున్నామని పేర్కొంది. రెండు తెలుగు రాష్ట్రాలు సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ధర్మాసనం వివాదాన్ని సూచించింది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ ఎన్‌వీ రమణ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రెండు రాష్ట్రాలకు చెందిన వ్యక్తినని, ఈ అంశంపై మధ్యవర్తిత్వంతో సమస్య పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాల సీనియర్ న్యాయవాదులకు సూచించారు. ఇందుకు సహకారం అందిస్తామని, లేదంటే పిటిషన్‌ను మరో బెంచ్‌కు బదిలీ చేస్తామన్నారు. ఇరువురు న్యాయవాదులు ప్రభుత్వాలను ఒప్పించి సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నానని, తాము అనవసరంగా జోక్యం చేసుకోవాలనుకోవడం లేదని సీనియర్ న్యాయవాదులతో చీఫ్ జస్టిస్ అన్నారు. నదీ జలాల వివాదంపై గతంలో వాదించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తరఫున కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే సమయం కోరగా.. కేసు విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ కోర్టుకు హాజరయ్యారు.

## కోవిడ్ నియంత్రణ, వైద్యరంగంలో నాడు-నేడుపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి: 45 ఏళ్లకు పైబడ్డవారు, గర్భవతుల తర్వాత టీచర్లకు వ్యాక్సినేషన్‌లో అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆగస్టు 16వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా టీచర్లకు వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని తెలిపారు. కోవిడ్ ప్రోటోకాల్స్‌ను తప్పనిసరిగా పాటించేలా చూడాలని స్పష్టం చేశారు. ఎక్కడా కూడా పెద్ద ఎత్తున జనం గుమిగూడకుండా చూడాలని సూచించారు. తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం కోవిడ్ నియంత్రణ, వైద్యరంగంలో నాడు–నేడుపై సమీక్ష చేపట్టారు. సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. "పెళ్లిళ్ల సీజన్‌లో పెద్ద ఎత్తున ప్రజలు ఒక చోటకు వచ్చే అవకాశాలున్నాయి. కోవిడ్ విస్తరణకు దారితీసే అవకాశాలున్నాయి. శుభకార్యాల్లో వీలైనంత తక్కువ మంది ఉండేలా చూడాలి. పెళ్లిల్లో 150 మంది మాత్రమే ఉండాలి. కోవిడ్ నివారణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలివవ అని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ జోరుగా సాగేంతవరకూ జాగ్రత్తలు తప్పనిసరని సీఎం జగన్ స్పష్టం చేశారు. రెండు నెలలపాటు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు మాత్రమే చేయాలని, ఆ పరీక్షల్లో కచ్చితమైన నిర్ధారణలు వస్తాయని గుర్తుచేశారు. ఇంటింటీ సర్వే కొనసాగాలని, లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు చేయాలని, 104 నంబర్ యంత్రాంగం సమర్థంగా సేవలందించేలా నిరంతరం పర్యవేక్షణ, సమీక్ష చేయాలని సూచించారు. విలేజ్ క్లినిక్స్‌ను పీహెచ్‌సీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం చేయాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. "ల్యాబులను కూడా అనుసంధానం చేయాలి. గ్రామంలో ప్రజల ఆరోగ్య వివరాలపై మ్యాపింగ్ జరగాలి. ఆరోగ్య శ్రీ కార్డుల ద్వారా సంబంధిత వ్యక్తి వివరాలన్నీ కూడా విలేజ్ క్లినిక్స్‌కు అందుబాటులో ఉండాలి. ఆరోగ్య శ్రీ కార్డు క్యూ ఆర్‌కోడ్ ద్వారా ఈ వివరాలన్నీకూడా వెంటనే తెలిసేలా చూడాలి. ఇదివరకే సేకరించిన డేటా వివరాలన్నింటినీ కూడా ఆరోగ్యశ్రీ కార్డుతో అనుసంధానం చేయాలి. నిర్దేశిత సమయంలోగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలి. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యుడు ఆగ్రామానికి వెళ్తున్నప్పుడు చికిత్సకు ఈ వివరాలు ఎంతో సహాయపడతాయి. సత్వరమే నిర్ధారణలతో కూడిన వైద్యం అందించడానికి దోహదపడుతుంది. డిసెంబర్ వరకు విలేజ్‌క్లినిక్స్ అన్నింటినీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలివవ అని అన్నారు. ఆస్పత్రుల్లో నాడు – నేడుకు సంబంధించి పనులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తికావాలని ఆదేశించారు. కొత్తగా నిర్మిస్తున్న 16 వైద్య కళాశాలల్లో పనుల ప్రగతిని ఈ సందర్భంగా సీఎం జగన్‌కు అధికారులు వివరించారు. వైద్యారోగ్య రంగంలో నాడు – నేడు పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సీఎం సూచించారు. నిధులపరంగా ఒక కార్యాచరణ ప్రకారం ముందుకురావాలని చెప్పారు. ఒక మంచి ఉద్దేశంతో 16 వైద్య కళాశాలల నిర్మాణాలను చేపట్టామని సీఎం జగన్ గుర్తుచేశారు. కళాశాలల్లో సరైన యాజమాన్య విధానాలపై ఎస్‌ఓపీలను రూపొందించాలని చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. " ఈ తరాలకే కాదు, భవిష్యత్ తరాలకు కూడా అత్యుత్తమ వైద్యం ప్రజలకు అందాలన్నదే మా కల. ప్రభుత్వ ఉద్యోగి కూడా వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రులను ఎంపికచేసుకునేలా వాటిని తీర్చిదిద్దాలి. ఎల్లప్పుడూ కూడా ఈ మెడికల్ కాలేజ్ ఆస్పత్రులు కొత్తగా కనిపించాలి.

## జాతీయ పతాక రూపశిల్పి పింగళికి ఉపరాష్ట్రపతి నివాళి



న్యూఢిల్లీ: భారత జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆయన స్మృతికి నివాళులు అర్పించారు. జాతిని సంఘటితం చేసే శక్తి జాతీయ పతాకానికే ఉందని నమ్మి, త్రికరణశుద్ధిగా మువ్వన్నెల పతాకం కోసం ఆయన చేసిన కృషి గురించి యువతరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. యువత ఆయన సేవలపై అధ్యయనం చేయాలి .సైనికుడిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, బహుభాషా కోవిదునిగా, వ్యవసాయ – ఖనిజ పరిశోధకునిగా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిన పింగళి వెంకయ్య దేశభక్తి, కార్యదీక్ష, సృజనాత్మక ఆలోచనలు, నిరాడంబర జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని, నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

### ఉక్కు ఉద్యమానికి మేయర్ మద్దతు

విశాఖపట్నం విశాఖ ఉక్కు కర్మాగారానికి వ్యతిరేకంగా నిరసనలు హోరెత్తుతున్నాయి. విశాఖలో జీవిఎంసీ గాంధీ విగ్రహం వద్ద సిపిఐ నేతలు చేపట్టిన నిరసనకు జీవిఎంసీ మేయర్ హరి వెంకట కుమారి మద్దతు ప్రకటించారు. నిరసనలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ,పార్టీ నేతలు .. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అయితే.. విశాఖ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. ఢిల్లీ వెళ్లిన ఉక్కు కార్మికులు, నేతలను అక్కడ పోలీసులు ఇబ్బందులు పెడితే.. రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ను పట్టించుకోకుండా.. రాజకీయాలు చేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం దురదృష్టకరమని, అందుకే నిరసన దీక్ష చేస్తున్నామని మరోవైపు మేయర్ హరి వెంకట కుమారి చెప్పారు.

## విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల నిరసనలతో దద్దరిల్లుతున్న ఢిల్లీ

### స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో కార్మికుల నిరసనలు

### జంతర్‌మంతర్ వద్ద భారీ వర్షం.. ధర్నాలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు






ఢిల్లీ: విశాఖ ఉక్కు పోరాట కమిటీ ధర్నాకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ మద్దతు ప్రకటించింది. ఈ ధర్నాలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద భారీ వర్షం కురుస్తోంది. భారీ వర్షంలోనూ కొనసాగుతున్న కార్మికుల నిరసనలు కొనసాగుతున్నాయి. భారీ వర్షాన్ని లెక్కచేయకుండా వైఎస్సార్సీపీ ఎంపీ ధర్నాలో పాల్గొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఉద్యమం ఢిల్లీని తాకింది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో కార్మికుల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులను పోలీసులు అడ్డుకుంటున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయొద్దంటూ కార్మికుల నినాదాలు చేస్తున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ అప్పులను ఈక్విటీలుగా మార్చాలని డిమాండ్ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జంతర్‌మంతర్ వద్ద స్టీల్‌ప్లాంట్ కార్మికుల నిరసన చేపట్టారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదాలతో ఢిల్లీ దద్దరిల్లుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో కార్మికులు చేపట్టిన ధర్నాకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ ధర్నాలో వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద భారీ వర్షం కురుస్తోంది. భారీ వర్షంలోనూ కార్మికుల నిరసనలు కొనసాగుతున్నాయి. భారీ వర్షాన్ని లెక్కచేయకుండా వైఎస్సార్సీపీ ఎంపీ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. "స్టీల్ ప్లాంట్ కోసం 23 వేల ఎకరాలను రైతులు త్యాగం చేశారు. స్టీల్ ప్లాంట్‌లో 1991లో ఉత్పాదన ప్రారంభమైంది. విశాఖ స్టీల్ ప్లాంట్ కెపాసిటీ 7.3 మిలియన్ టన్నులు. లాభాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం తగదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుంది. దురుద్దేశపూర్వకంగానే స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం చూస్తోంది.. ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటీకరణ చేయాల్సిన అవసరం లేదు. దశాబ్దం పాటు పోరాటం చేసి స్టీల్ ప్లాంట్ సాధించుకున్నాం. ఎన్నో త్యాగాలతో విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు జరిగింది. కరోనా సమయంలో ఎంతోమంది ప్రాణాలను స్టీల్‌ప్లాంట్ కాపాడింది. రూ.22 వేల కోట్ల అప్పులను ఈక్విటీగా మార్చాలి. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతంగా గనులు కేటాయించాలి. ఇక స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కోసం ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని, విశాఖ స్టీల్‌ప్లాంట్ వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్ఆర్‌సీపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు.

## పింగళి వెంకయ్య సేవలను ఈ దేశం ఎన్నటికీ మరవదు: సీఎం జగన్

అమరావతి: భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళి అర్పించారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా సీఎం జగన్ "భారత జాతీయ పతాక రూపకర్తగా తెలుగు జాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన.. పింగళి వెంకయ్య నిత్య స్మరణీయులు. స్వాతంత్ర్య సమరయోధునిగా ఆయన చేసిన సేవలను ఈ దేశం ఎప్పటికీ మరువదు. జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నివాళివవ అంటూ ట్వీట్ చేశారు.



## హైకోర్టులో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై విచారణ




అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై హైకోర్టులో విచారణ జరిగింది. స్టీల్ ప్లాంట్ తరఫున కేంద్ర ఆర్థిక, ఉక్కు, గనులు శాఖలను కౌంటర్ వేయాలని గతంలో న్యాయస్థానం కోరింది. ఆర్థిక శాఖ తరఫున వేసిన కౌంటరే మిగిలిన శాఖలకు వర్తిస్తుందన్న కేంద్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రైవేటీకరణ ఎందుకు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ప్రత్యామ్నాయాలను కౌంటర్‌లో పిటిషనర్ తరఫు న్యాయవాది యలమంజుల బాలాజీ ప్రస్తావించారు. ప్రైవేటీకరణ సమయలో భాగస్వాములు అభిప్రాయాలు ఎందుకు తీసుకోలేదని బాలాజీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తరఫున తాము కూడా కౌంటర్ దాఖలు చేస్తామని ప్రభుత్వ న్యాయవాది సుమన్ తెలిపారు. కేంద్రం వేసిన కౌంటర్‌పై రిజైన్డర్ వేసేందుకు రెండు వారాల సమయం కావాలని కోర్టును బాలాజీ కోరారు. కేసు విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

## 'జలశక్తి శాఖలో పోలవరం ప్రాజెక్టు డీపీఆర్ ఏదీ పెండింగ్‌లో లేదు

### కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

న్యూఢిల్లీ: పోలవరం సవరించిన అంచనా వ్యయం ప్రతిపాదనలను అడ్వైజరీ కమిటీ 2011లో ఒకసారి, ఆ తర్వాత ఫిబ్రవరి 2019లో ఆమోదించిందని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా సోమవారం రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి షెకావత్ సమాధానం ఇస్తూ.. జలశక్తి శాఖలో పోలవరం ప్రాజెక్టు డీపీఆర్ ఏదీ పెండింగ్‌లో లేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు 2005–06 లెక్కల ప్రకారం రూ.10,151.04 కోట్ల అచనాలతో డీపీఆర్‌ను ఆమోదించామని తెలిపారు. 2009 జనవరి 20న ఈ డీపీఆర్‌ను జలశక్తి శాఖలోని ఫ్లడ్ కంట్రోల్ అండ్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ 95వ మీటింగ్‌లో ఆమోదించిందని తెలిపారు.



# సంపాదకీయం

మంగళవారం 03 ఆగస్టు 2021

## డైవర్షన్ పాలిటిక్స్ తో రచ్చ

చట్టసభల సమావేశాల్లో ప్రధానమైన అంశాలు ప్రజల దృష్టిలో పడకుండా అధికార పార్టీలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుంటాయి. రాజకీయ రచ్చ మాత్రమే ప్రజల ముంగిట్లో కనిపిస్తుంది. ప్రజాజీవితాలతో ముడిపడిన విషయాలు పక్కదారి పడుతుంటాయి. తాము పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నట్లు ప్రతిపక్షాలు నటిస్తుంటాయి. సర్దుబాటు చేసుకుని సరిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికార పక్షం యాక్ట్ చేస్తుంటుంది. కానీ ప్రస్తుతం పార్లమెంటు సమావేశాల్లో పూర్తిగా అజెండానే పక్కదారి పట్టింది. ప్రతిపక్షమే అధికార పార్టీకి అదనపు వనరుగా మారింది. అసలు విషయాలు సోదిలోకి రాకుండా గందరగోళం కొనసాగుతోంది. కాలమంతా గాలిలో కలిసిపోతోంది. కోట్ల రూపాయల వ్యయంతో నిర్వహిస్తున్న పార్లమెంటు సమావేశాలు పది రోజులుగా పట్టుమని పదినిముషాలైనా చర్చ లేకుండా నిరంతరం వాయిదాలు పడుతున్నాయి. దీనివల్ల ఎవరికేని ప్రయోజనం ఉందా? అని ప్రశ్నించుకుంటే ఒక్క అధికారపార్టీకే ఆ లాభం దక్కుతోంది.ప్రతిపక్షాలు చాలా అసహనంతో ఊగిపోతున్నాయి. బీజేపీ అంటే వాటికి పడకపోవచ్చు. కానీ ప్రజలు అధికారమిచ్చారు. మరో రెండున్నర సంవత్సరాల పాటు కమలం పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ అధికారంలో ఉంటుంది. ఇది ఎవరూ తోసిపుచ్చలేనిది. వచ్చే ఎన్నికల నాటికి తాము సిద్ధం కావాలనుకుంటే ప్రతిపక్షాలు అంశాల వారీగా అధికార పార్టీని తూర్పారబట్టాలి. ఒక ఫెగాసిస్ వంటి నిఘా అంశమే దేశానికి అతిపెద్ద సమస్య అన్నట్లుగా వ్యవహరించడంతో ప్రతిపక్షాలు నష్టపోతున్నాయి. ప్రజల్లోనూ అనుమానాలు నెలకొనే అవకాశం ఏర్పడుతుంది. ఇంత పెద్ద దేశంలో కేవలం వెయ్యిమంది జాబితా ఫెగాసిన్ నిఘా లిస్టులో ఉందంటే అదేమంత పెద్ద వ్యవహారం కాదు. పైపెచ్చు దాని పై రాజకీయంగా తేల్చుకోవడానికి అనేక మార్గాలున్నాయి. ఇప్పటికే సుప్రీం కోర్టును ఆశ్రయించారు. మమత సొంతంగా తన రాష్ట్రంలో న్యాయవిచారణకు ఆదేశించారు. వీటి ద్వారా ఏమైనా లీడ్స్ దొరికితే కేంద్ర ప్రభుత్వం కూడా నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోతుంది. ప్రస్తుతం దేశంలో ప్రజలు అత్యయిక స్తితిలో ఉన్నారు. జీవనం దుర్భరమవుతోంది. వీటి పై పార్లమెంటు వేదికగా గళమెత్తా?ల్సిన ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయివిపక్షాల ఐక్యతను చాటుకోవడానికి ఫెగాసిస్ అంశాన్ని ఒక అస్త్రంగా వాడుకోవాలని పార్టీలు చూస్తున్నాయి. నిజానికి నాయకులందరిలోనూ ఈ అంశం గుబులు రేకెత్తిస్తోంది. తమ సొంత వ్యాపారాలు, రాజకీయ బేరసారాలు, ఆర్థిక అక్రమాలన్నిటికీ ఇప్పుడు మొబైల్ అనేది ఒక సాధనంగా మారుతోంది. ఎక్కడ డొంక లాగినా మొత్తం తీగ కదులుతుంది. ఇది అందరకూ తెలిసున్న వ్యవహారమే. అందుకే నాయకులు భయపడుతున్నారు. తమ వ్యక్తిగత, రాజకీయ జీవితం నిఘా నీడలో ఉందనే అంశమే వారిని ఆందోళనకు గురి చేస్తోంది. పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత న్యాయస్థానాలకు ఉంటుంది. అందువల్ల ఈ తతంగాన్ని న్యాయ స్థానం ద్వారా కొలిక్కి తెచ్చుకోవచ్చు. ఇది పక్కన పెట్టి తమను ఎన్నుకున్న ప్రజల కోణంలో దృష్టి సారించాలి. కరోనా రెండు దశల తర్వాత ప్రజల జీవితానికే ప్రమాదం ఏర్పడుతోంది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతిపక్ష నాయకులు దీనిని ప్రధానాంశంగా చేసుకోకపోవడం విచారకరం. ప్రభుత్వం అరకొర సాయంతోనే సరిపెట్టేస్తోంది. పైపెచ్చు వాక్సిన్ల వంటి అత్యవసర పంపిణీల విషయంలోనూ క్రమేపీ ఉదాసీనత నెలకొంటోంది. డిసెంబర్ నాటికి మొత్తం జనాభాకు వాక్సిన్లు అందచేస్తామన్న హామీ నెరవేరే సూచనలు కనిపించడం లేదు. తాజాగా కలిసి వచ్చిన పార్లమెంటు సమావేశాలను ప్రజారోగ్యానికి అంకితం చేస్తే ప్రయోజనదాయకంగా ఉంటుంది. ప్రభుత్వాన్ని నిలదీస్తే ఎంతోకొంత మేలు జరుగుతుంది. ఫెగసిస్ వంటి అంశాలు ఒక్కరోజుతో ముగిసే గొడవలు కావు. ఒకవేళ విచారణ కమిటీని నియమించినా మళ్లీ ప్రభుత్వ అదుపాజ్ఞల్లోనే విచారణ సాగుతుంది. అందువల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదు.పార్లమెంటు వర్షాకాల సమావేశాల పట్ల ప్రభుత్వం ముందుగా కొంత కలవరపాటుకు గురైంది. వరసగా ప్రభుత్వ వైఫల్యాలు కళ్లెదురుగా కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాలన్నీ గళమెత్తితే తట్టుకోవడం కష్టం. పైపెచ్చు ప్రజల్లోనూ స్పందన వస్తుంది. కేంద్ర ప్రభుత్వ లోపాలను కడిగిపారేసేందుకు అతి సులభమైన మార్గాలు ప్రతిపక్షాలకు కనిపించాయి. వాటిని అందిపుచ్చుకోలేదు. పరస్పరం సహకరించుకుంటూ ప్రతిపక్షాలన్నీ తమ పోరాటం ప్రజలకోసమే నని చాటి చెప్పుకొనే అవకాశాన్ని జారవిడుచుకున్నాయి.. బీజేపీని నిలదీస్తున్నామనే భ్రమలో తమకు తామే గోతిలో పడుతున్నాయి . పార్లమెంటు సమావేశాలతో తమకు ఏమాత్రం సంబంధం లేదని ప్రజలు ఒక నిశ్చయానికి వచ్చేస్తున్నారు. ఇతర వేదికల మీద తేల్చుకొనే అంశాలపై ఎక్కువ సమయం కేటాయిస్తే అసలు ప్రజావేదిక కు అర్థమే ఉండదు. ప్రతిపక్షాల వైఖరి చూసి బీజేపీ లోలోపల సంతోషిస్తూ ఉండవచ్చు. అందుకే ఎటువంటి తొట్రు పాటు లేకుండా కేంద్రం ధీమాగా కనిపిస్తోంది. –

## జగన్ కు విన్నపాలతో నేతలు

విజయవాడ, ఆగస్టు 2, (న్యూస్ పల్స్)ఈసారికి ఇలా అయిపోనీయండి వచ్చే ఎన్నికల్లో మా అబ్బాయికి చాన్స్ ఇవ్వండి అంటూ చాలా మంది సీనియర్లు వైసీపీలో ఇప్పటికే జగన్ కి అర్జీలు పెట్టుకుంటూ వస్తున్నారు. తమ సేవలు అక్కరలేదు అనుకుంటే ఆ ఇచ్చే పదవి ఏదో తమ ఇంట్లోకే మళ్ళీ ఇవ్వాలని వారు కొత్త బేరాలు పెడుతున్నారు. అయితే జగన్ ఆలోచనలు వేరు. ఆయనకు ఈ వారసత్వాల మీద అసలు నమ్మకం లేదు. పైగా ఆయన ఆలోచనలు ఎపుడూ కొత్త వారికీ, పార్టీ కోసం కష్టపడిన వారికీ అవకాశాలు ఇవ్వాలనే ఉంటాయి. దాంతో ఇపుడు సీనియర్లకు ఒక్కసారిగా గుండె దడ మొదలైందిట.ఎంతసేపూ మేమూ మా కుటుంబం అంటూ పదవులు పంచుకునే కల్చర్ కి జగన్ పూర్తిగా చెక్ పెట్టబోతున్నారు. సీనియర్లు అయితే వారికి ఇక రిటైర్మెంటే తప్ప వారసులకు ఉద్యోగాలు ఇవ్వడం కుదరదు అని కచ్చితంగా చెప్పేస్తున్నారు. దాంతో సీనియర్ల కుమారుల రాజకీయ భవిష్యత్తు ఇపుడు డోలాయమానంలో పడిపోయింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రా జిల్లాలు తీసుకుంటే చాలా మంది సీనియర్లు తమ కుమారులకు రాజకీయ బాధ్యతలు అప్పగించి రెస్ట్ తీసుకుందామని అనుకుంటున్నారు. శ్రీకాకుళం నుంచి మొదలుపెడితే విశాఖ దాకా వారే పెద్ద సంఖ్యలో ఉన్నారు. మరి వారంతా జగన్ మార్క్ డెసిషన్ విని ఖంగు తింటున్నారుట.శ్రీకాకుళం జిల్లాలో చూసుకుంటే ఉప ముఖ్యమంత్రి ధర్మాన క్రిష్ణదాస్ ఆ మధ్యన బోల్డ్ స్టేట్మెంట్ ఒకటి ఇచ్చెశారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయను అని ఆయన తానుగా చెప్పేసుకున్నారు. ఆయన కుమారుడు డాక్టర్ క్రిష్ణ చైతన్యను నరసన్నపేట నుంచి బరిలోకి దింపాలని చూస్తున్నారు. దానికి రిహార్సల్స్ గా జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయించారు కూడా. ఇక స్పీకర్ తమ్మినేని సీతారామ్ కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్ కూడా వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయాలనుకుంటున్నారు. ఆయనకూ ఇపుడు గట్టి షాక్ తగలబోతోంది. ఇక మాజీ మంత్రి ధర్మనా ప్రసాదరావు కుమారుడు రామ మనోహర్ నాయుడు కూడా శ్రీకాకుళం నుంచి ఎమ్మెల్యేగా పోటీకి తయారు అవుతున్నారు.

జగన్ కనుక ఇదే నిర్ణయం అమలు చేస్తే జూనియర్లు అంతా నీరు కారాల్సిందే మరి.ఇక విజయనగరం జిల్లాలో చూసుకుంటే మంత్రి బొత్స సత్యనారాయణ కుమారుడు డాక్టర్ సందీప్ కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నారు. ఇదే జిల్లాలో కోలగట్ల వీరభద్రస్వామి కుమార్తె శ్రావణి కూడా పోటీకి రెడీ అంటున్నారు. విశాఖలో చూసుకుంటే గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు వంశీరెడ్డి పోటీకి రెడీ అంటున్నారు. ఎలమంచిలి నుంచి కన్నబాబు రాజు కుమారుడు సుకుమార్ వర్మ కూడా టికెట్ ఆశిస్తున్నారు. మరి ఇంతమంది వారసులు తయారుగా ఉన్నా కూడా జగన్ వద్దు అంటే చాలు ఒక్కసారిగా సైలెంట్ అవాల్సిందే. మరి జగన్ అలాంటి నిర్ణయం తీసుకుంటే వీరంతా సహకరిస్తారా లేక వ్యతిరేకించి పక్క పార్టీలలోకి ఫిరాయిస్తారా అన్నది వేచి చూడాల్సిందే.

## టీడీపీతోనే జనసేన....అడుగులు

కాకినాడ, ఆగస్టు 2, (న్యూస్ పల్స్)పవన్ కళ్యాణ్ గతానికి భిన్నంగా జనసేన ను వ్యూహాత్మకంగా ముందుకు నడిపే పనిలో పడ్డారు. ఒక పక్క సినిమాల్లో బిజీగా ఉంటూనే తన పార్టీ రాజకీయాలకు పదును పెట్టేస్తున్నారు. తిరుపతి ఎన్నికల్లో బిజెపి చవిచూసిన పరాజయం తరువాత అసలే అంతంత మాత్రంగా ఉన్న కమలంతో దోస్తీ కి మంచి ముహర్తం చూసి కటీఫ్ కొట్టేయడమే బెటర్ అని పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు సమాచారం. మరి కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీని వదిలి పెట్టి రావడం ఒకరకంగా కొంత కష్టమైన పనే అయినప్పటికీ ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందుగా ఈ విడాకులు ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.జనసేనను విడిచి వెళితే ఎలాంటి దుష్పలితాలు వస్తాయో టిడిపి అధినేత చంద్రబాబు స్వయంగా గత ఎన్నికల్లో అర్ధం చేసుకున్నారు. ఎప్పుడు పొత్తు లేకుండా ఒంటరిగా ఎన్నికలను ఎదుర్కొని బాబు గత ఎన్నికల్లో అతి విశ్వాసానికి పోయి ఒక పక్క బిజెపి ని మరోపక్క పవన్ కళ్యాణ్ తోనూ కలిసి వెళ్లకుండా ఘోరంగా దెబ్బ తిన్నారు. అయితే ఎలాంటి దిక్కుమాలిన పరిస్థితి వచ్చినా 30 శాతానికి పైబడే టిడిపి ఓటు బ్యాంక్ పలు ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో ఇటు జనసేన, అటు కలిసి వస్తే బిజెపి లతో దోస్తీ కట్టడం లేదా బిజెపి ని వదిలి అయినా పవన్ కళ్యాణ్ తో ప్రయాణించేందుకు చంద్రబాబు రెడీ గా ఉన్నారు.జనసేన కలిస్తే మరో ఏడు నుంచి 10 శాతం ఓట్లు కలుస్తాయని దీనికి బిజెపి కూడా జత కలిస్తే ఫ్యాన్ రెక్కలు విరిచేంత బలం పుంజుకుంటుందన్నది బాబు ఆలోచన అంటున్నారు ప్రభుత్వ వ్యతిరేక ఓటు కూడా పెరుగుతుందని వీటన్నిటి శాతం పెరిగితే అధికారానికి చాలా దగ్గర అవుతామన్నది ఆయన అంచనా అని ఆ పార్టీ వర్గాల్లో నడుస్తుంది.అదే రీతిలో పవన్ కళ్యాణ్ సైతం లెక్కలు వేసుకున్నట్లు తెలుస్తుంది. అందుకే ఆయన గతం లో లేని విధంగా పార్టీ నిర్మాణం పై శ్రద్ధ పెట్టారు. కాపు సామాజికవర్గం ఓట్లు అధికంగా ఉన్న నియోజకవర్గాలు ముఖ్యంగా ఉభయగోదావరి, విశాఖలపై పవన్ కళ్యాణ్ పార్టీ ఫోకస్ పెంచినట్లు తెలుస్తుంది. ఇక్కడ బలమైన జనసేన అభ్యర్థులకు టిక్కెట్లు ఇప్పించేలా ఒప్పందం చేసుకుని గతంలో చేసిన తప్పులు తిరిగి చేయకుండా ఉండాలని పవన్ కళ్యాణ్ ఆలోచనగా ప్రచారం సాగుతుంది. అయితే దీనిపై రాబోయే రోజుల్లో మరింత క్లారిటీ రానుంది.ఈ నేపథ్యంలో ఈ ఫార్ములా జగన్ సంక్షేమ సునామిని తట్టుకుని నిలబడుతుందో లేదో చూడాలి. అయితే నూటికి నూరు శాతం అందరికి న్యాయం చేయడం ఏ ప్రభుత్వానికి సాధ్యం కాదు. సొంత పార్టీలో అసంతృప్తులు , వెన్నుపోట్లు లేకుండా చూసుకోవడం రాజకీయాల్లో కష్టమే. జగన్ ఎంతటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా 51 శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చినా దాని ప్రభావం దీర్ఘకాలం కొనసాగడం కొనసాగించడం కష్టమే అన్నది విపక్షాల అంచనా. చూడాలి భవిష్యత్తు రాజకీయాల్లో ఏమి జరగనుందో.

## వైసీపీలో ఆధిపత్యపోరు..



రాజమండ్రి, ఆగస్టు 2, (న్యూస్ పల్స్)'ఆధిపత్య రాజకీయాలు ఏ పార్టీలో అయినా ఉంటాయి. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా నేతల మధ్య ఆధిపత్య రాజకీయం జోరుగానే సాగింది. అయితే.. అధినేత ఎక్కడకక్కడ ఆధిపత్య రాజకీయాలను కట్టడి చేస్తూ వచ్చారు. దీంతో పార్టీలో డిసిప్లిన్ ఎక్కడా దారితప్పలేదు. అధినేతపై ఎక్కడా గౌరవమూ తరగలేదు. అయితే ఇప్పుడు అధికారంలో ఉన్న వైసీపీలో మాత్రం ఆధిపత్య రాజకీయాలు నిత్యం రగులుతూ పెరుగుతూ.. ఉన్నా.. అడ్డుకట్టవేసేవారు.. పిలిచి కూర్చోబెట్టి పరిష్కరించేవారు.. కనిపించడం లేదు.రాష్ట్ర వ్యాప్తంగా అన్నిజిల్లాల్లోనూ వైసీపీ నేతల మధ్య తీవ్ర ఆధిపత్య రాజకీయాలు చోటు చేసుకుంటున్నా యి. ఇప్పటికే కొనసాగుతున్నవి కొన్నయితే.. కొత్తగా తెరమీదికి వస్తున్నవి కూడా కొన్ని ఉన్నాయి. మరి వీటికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యతను ఎవరు తీసుకుంటున్నారు? ఆయా రగడలకు ఎప్పుడు ఫుల్ స్టాప్ పెడతారు? అనే ప్రశ్నలు మాత్రం అలానే ఉన్నాయి. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ నేతల మధ్య ఆధిపత్య రాజకీయాలు సాగుతున్నాయి. తాజాగా గుంటూరు జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే మధ్య పోరు మరింత పెరిగింది.ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడంలేదంటూ ఏకంగా ఎంపీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జిల్లాలో సంచలనంగా మారింది. గుంటూరు జిల్లా నర్సరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు, చిలకలూరి పేట ఎమ్మెల్యే రజనీల మధ్య విబేధాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. గతంలో ఈ వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి. ఎంపీ ఎప్పుడు నియోజకవర్గంలోకి వచ్చినా ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకోవడం, రచ్చ రచ్చ చేయడం రొటీన్‌గా మారిందిఅదేవిధంగా తూర్పుగోదావరిలోనూ నేతల మధ్య పొసగడం లేదు. కృష్ణా జిల్లాలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అయినప్పటికీ.. పార్టీ అధినేత కానీ, కీలక సలహాదారులు కానీ.. పట్టించుకోకపోవడం గమనార్హం. అయితే.. జిల్లాల్లో పార్టీ బాధ్యతలను ఇంచార్జ్ మంత్రులకు అప్పగించారు. సో.. వారే చూసుకుంటారులే.. అని ఉదాసీనతో లేక.. ఇప్పుడు కొట్టుకుంటున్నా.. మున్ముందు.. సర్దుకుంటారనే భావనో.. తెలియదు కానీ ఇప్పటికైతే.. వైసీపీలో నేతలు రగడలకు సై అంటున్నారు.తూర్పు గోదావరి జిల్లాలో మంత్రి కురసాల కన్నబాబు వర్సెస్ ఎమ్మెల్యే ద్వారంపూడికి పడట్లేదు. మరో మంత్రి వేణుకు కొత్త ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎంపీ బోస్‌తోనూ గొడవ ఉంది. ఇక రాజోలు రాజకీయం రచ్చ రచ్చగానే ఉంది. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు గొడవలకు అంతూ పంతూ లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే.. నేతలు పట్టుకోల్పోవడమే కాకుండా.. పార్టీకి కూడా నష్టం కలగడం ఖాయమని అంటున్నారు పరిశీలకులు.

## పోలవరానికి అడగడుగునా కొర్రీలు

విజయవాడ, ఆగస్టు 2, (న్యూస్ పల్స్)పోలవరం ప్రాజెక్టుకు సంబందించిన నిధులపై కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో చేసిన ప్రకటన ప్రాజెక్టు నిర్మాణంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపనుంది. 2014 నాటి అంచనా విలువలకు మించి అదనంగా ఇవ్వలేమంటూ కేంద్రం చేసిన ప్రకటనతో పునరావాసం, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్ర పనులు ప్రశ్నార్థకంగా మారాయి. జాతీయ ప్రాజెక్టు గా ప్రకటన చేసిన తరువాత అన్ని అంశాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సిఉంది. దీనికి భిన్నంగా సాగునీటి ప్రాజెక్టుల చరిత్రలో ఎక్కడా లేనివిధంగా పోలవరం విషయంలో కేంద్రం వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ఏ నిర్మాణం అయినా ఆలస్యం అయితే అంచనాలను సవరించడం రివాజు. పోలవరం ప్రాజెక్టు పూర్తికి సవరించిన నిర్మాణ వ్యయాన్ని రూ 55,548.87 కోట్లు (డిపిఆర్2) అవసరం కాగా కేంద్ర 2013–14 నాటి అంచనా మేరకు రూ 20,398కోట్లను మాత్రమే కేంద్రం ఇస్తామంటోంది. హెడ్‌వర్క్స్‌తో పాటు స్పిల్‌వే, కాఫర్‌డ్యామ్‌తో పాటు పునరావాసం అంచనాలను కేంద్రప్రభుత్వ అనుమతితోనే అంచనాలను సవరించారు. సవరించిన అంచనాల డిపిఆర్‌ను కేంద్రప్రభుత్వ పరిధిలోని సిడబ్ల్యుసి, సాంకేతిక సలహా కమిటీలు కూడా ఆమోదించాయి. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ నిరంతర పర్యవేక్షణతో రూపొందిన ఈ డిపిఆర్ 2కు కేంద్రం మొండిచెయ్యి చూపడంతో ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో వున్న రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి మరింత ఘోరంగా మారనుంది.సవరించిన అంచనాలకు ఆమోదం లభిస్తే రూ.34,489 కోట్లు అదనంగా వస్తుంది. పెరిగిన మొత్తంలో ఎక్కువగా 2013 పునరావాస చట్టం ప్రకారం పునరావాసానికే ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. పునరావాసం కోసం ఇప్పటిదాకా రూ 6,371 కోట్లు ఖర్చుచేయగా, ఇంకా రూ 26,796 కోట్లు అవసరం ఉందన్నది డీపీఆర్–2 అంచనా. జాతీయ హోదా రావడానికి ముందు ఖర్చు చేసిన రూ 4,730 కోట్లు లెక్కల్లోకి తీసుకోమని, మిగిలిన రూ 15,668 కోట్లు మాత్రమే ఇస్తామని కేంద్రం వాదిస్తోంది. పోలవరం ప్రాజెక్టులో 2007 నుండి పునరావాసం పనులు ఇప్పటికీ 10శాతం కూడా పూర్తి కాని పరిస్థితి వుంది. పోలవరం పునరావాసంను మొదటిఫేజ్ కింద చేపట్టిన 41.15మీటర్ల పరిధిలో ఐదు మండలాల్లో 234 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఇందులో 18,622 కుటుంబాలు ముంపుకు గురవుతు న్నాయి. వీరికి 73 ప్రాంతాల్లో పునరావాసగ్రామాలను నిర్మిస్తున్నారు. పునరావాసం పనులు నత్తనడకన నడుస్తుండ టంతో ఇప్పిటిదాకా కేవలం 3,920 కుటుంబాలను మాత్రమే తరలించారు. ఇటీవల కాఫర్ డ్యామ్ ప్రభావంతో నీళ్లు వెనక్కు రావడంతో గ్రామాల్లోకి నీరు వచ్చేసింది.

## వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఇమేజ్ ఉండదా

నెల్లూరు, ఆగస్టు 2, (న్యూస్ పల్స్)ఏపీ అధికార పార్టీకి ఒక ఇమేజ్ ఉంది. నాయకుడిగా జగన్ పార్టీని నడిపిస్తున్నా.. వ్యవస్థీకృతంగా చూసు కుంటే.. పార్టీ ఇమేజ్ అంతా కూడా దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనపైనే ఆధారపడింది. ఎన్నికలకు ముందు.. వైఎస్ ఇమేజ్‌ను, పేదల్లోను, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీల్లోనూ.. వైఎస్‌కు ఉన్న సానుభూతిని వైసీపీ నేతలు బాగానే వినియోగించుకున్నారు. జగన్ కాంగ్రెస్‌ను వీడి బయటకు వచ్చినప్పటి నుంచే ప్రతిక్షణంలోనూ వైఎస్ ఇమేజ్‌ను వాడుకుంటూనే వస్తున్నారు. జగన్ సైతం తన ప్రతి ప్రసంగం ప్రారంభానికి ముందే మహానేత పేరు ప్రస్తావిస్తూనే వస్తున్నారు. జనాల్లో వైఎస్ పట్ల సానుభూతి కూడా ఉంది. ఈ ఫ్యాక్టర్ కూడా వారిని విజయం వైపు నడిపించింది కూడా. అయితే.. వచ్చే ఎన్నికల నాటికి ఈ ఇమేజ్‌ను కొంచెం పక్కన పెట్టి.. జగన్ ఇమేజ్‌ను తీసుకురాని పక్షంలో కష్టం అవుతుందన్న అభిప్రాయాలు ఆ పార్టీ సీనియర్ల నుంచే వ్యక్తమ వుతున్నాయి.ప్రస్తుతం గత ఏడాది కాలంగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే.. జగన్ ఇమేజ్ పెంచుకునేలానే పార్టీ, ప్రభుత్వం కూడా వ్యవహ రిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది.. వైఎస్ రాజశేఖరరెడ్డి పేరిటే.. అనేక పథకాలను ప్రవేశ పెట్టారు. ప్రతి పథకానికీ, ఆయన పేరు ఉంచారు. కానీ, తర్వాత తర్వాత.. వైఎస్ జగన్ పేరును పెడుతూ వచ్చారు. ఇటీవల ప్రారంభించిన అనేక పథకాలకు జగనన్న పేరుతోనే ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో ప్రతి కార్యాలయం లోనూ జగన్ ఫొటోనే ఉంచుతున్నారు. అధికారులు కూడా గతంలో వైఎస్‌పేరును జపించేవారు. కానీ, ఇటీవల కాలంలో దీనిని పక్కన పెట్టారు. జగన్ పేరుతో మాత్రమే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.మరీ చిత్రం ఏంటంటే.. కొన్ని కొన్ని పథకాల విషయంలో అసలు వైఎస్ ప్రస్తావన కూడా ఉండడం లేదు. అత్యంత కీలకమైన.. పేదలకు ఇళ్లు పథకానికి సంబంధించి మొదట్లో.. వైఎస్సార్ ఇళ్లు అనే పేరు పెట్టాలని భావించారు. కానీ, పేదలకు సంబంధించిన సెంటిమెంటుతో కూడుకున్న విషయం.. పది కాలాల పాటు నిలిచిపోయే లబ్ధిని చేకూరుస్తున్నందున.. దీనికి జగన్ పేరు పెడితే బాగుంటుందని ఆ దిశగానే నిర్ణయం తీసుకున్నారు. గతంలో వైఎస్ రైతుల గుండెల్లో ఎలా నిలిచిపోయారో.. పేదల గుండెల్లో జగన్ పేరు కూడా అలానే ఉంటుందని అనడంతో జగన్ చివరకు తనపేరునే ఖరారు చేసుకున్నారు. ఇలా.. రాబోయే ఎన్నికల నాటికి వైఎస్ పేరును కొంత మేరకు తగ్గించి.. జగన్ ఇమేజ్‌తోనే ముందుకు సాగాలని పార్టీ అధిష్టానం, జగన్ నిర్ణయంగా తెలుస్తోంది.

## కేంద్రం కొర్రీలతో ఇబ్బందులు

విజయవాడ, ఆగస్టు 2, (న్యూస్ పల్స్)కృతి వైపరీత్యాలతో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికి తీసుకునే రుణాలకు సైతం కేంద్ర ప్రభుత్వం మోకాలడ్డుతోంది. దీంతో మంజూరైన అప్పు కూడా రద్దవుతోంది. అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వ వైఖరివల్ల రూ.442 కోట్ల అప్పు రద్దైంది. మరో రూ.186 కోట్ల పనులు నిలిచిపోయాయి. అనునిత్యం తుపానులతో అతలాకుతలమయ్యే రాష్ట్రానికి ఈ పరిస్థితి మిరగుడుపడడం లేదు. తుపాన్లతో నష్టపోయిన ప్రాంతాల్లో పునర్‌నిర్మాణంతో పాటు, ఇతర అభివృద్ధి పనుల కోసం ప్రపంచబ్యాంకుతో రూ.2,220 కోట్ల మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దీనిలో 250 మిలియన్ డాలర్ల రుణాన్ని ప్రపంచబ్యాంకు ఇవ్వాల్సి ఉంది. దీనికి సంబంధించిన రూ.442 కోట్ల రుణాన్ని ప్రపంచబ్యాంకు రద్దు చేసుకుంది. కరోనా తదితర కారణాలతో ఈ మొత్తంతో చేపట్టాల్సిన పనులు ఆలస్యమయ్యాయని అధికారులు అంటున్నారు. ఇటువంటి సమయంలో ప్రపంచబ్యాంకుతో మాట్లాడి గడువు పెంపునకు సహకరించాల్సిన కేంద్ర ప్రభుత్వం దానికి భిన్నంగా రద్దుకు సిఫార్సు చేసిందని అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వమే సిఫార్సు చేయడంతో ప్రపంచబ్యాంకు కూడా ఆ మేరకు రుణాన్ని రద్దు చేసినట్లు సమాచారం. అప్పు రద్దుకావడంతో ఆ మొత్తంతో చేపట్టాల్సిన పలు పనులను కూడా నిలిపివేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్ ఎఫైర్స్ శాఖ నురచి ఆదేశాలు వచ్చినట్లు చెబుతున్నారు. రద్దయిన పనుల్లో అనేకం విశాఖపట్నంలో ఉన్నాయి. వీటిలో పరచాయితీరాజ్ శాఖకు చెరదిన హైలెవెల్ వంతెన ఒకటి. దీనికి సిఆర్‌జెడ్ అనుమతి సకాలంలో రాకపోవడం వల్ల రద్దు చేయాల్సి వచ్చిరది. అలాగే రూ.40 కోట్ల విలువైన విశాఖలోని తెన్నేటి పార్క్ బీచ్ అభివృద్ధి, రూ.27 కోట్లతో చేపట్టాల్సిన విశాఖ జూ పనులు, రూ.50 కోట్లతో అమలు చేయాల్సిన రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెరట్ అథారిటీలో డ్రోన్ ఆధారిత లిడర్ సర్వే పథకం కూడా ఉన్నాయి. వచ్చిన రుణాన్ని సకాలంలో ఖర్చు చేయకపోవడం, పనులు నత్తనడకన చేస్తుండటం వంటి రాష్ట్ర ప్రభుత్వ తప్పులు కూడా రుణం రద్దు కావడానికి కారణమని సమాచారం. హైలెవల్ వంతెనకు సిఆర్‌జెడ్ అనుమతి కేంద్రమే ఇవ్వాలని, దానిని సకాలంలో ఇవ్వకుండా జాప్యానికి కేంద్రమే కారణమైందని, ఇటువంటి పనులు అనేకం ఉన్నాయని రాష్ట్ర అధికారులు అంటున్నారు.

## ఖరీఫ్ ముందుకు సాగని సాగు

ఏలూరు, ఆగస్టు 2, (న్యూస్ పల్స్)ఖరీఫ్ కాలంలో రెండు మాసాలు గడుస్తున్నా పంటల సాగులో పెద్దగా పురోగతి లేదు. సేద్యం నెమ్మదిగా సాగుతోంది. సీజన్‌లో జూన్, జులై నెలలు సాగుకు అత్యంత కీలకమైనవి. ఇప్పటికి సగం సేద్యం పూర్తవ్వాలి. ఈ తడవ సాధారణ సాగులో 37 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. అదే నిరుడు 54 శాతం సాగు నమోదైంది. జూన్‌లో రుతుపవనాలు మొరాయించగా జులై మధ్య నుండి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు ఆశాజనకంగా పడుతున్నాయి. అయినప్పటికీ పంటల సాగు నత్తనడకన సాగుతోంది. జూన్ నెలాఖరుకు సాధారణవర్షంలో 9.8 శాతం తక్కువ వర్షం నమోదైంది. సాంకేతికంగా రాష్ట్ర సగటు నార్మల్ అయిన ప్పటికీ ఆరు జిల్లాలు తక్కువ వర్షం కురిసిన కేటగిరీలో ఉన్నాయి. నెల్లూరు అత్యల్ప వర్షం పడ్డ కేటగిరీలో ఉంది. జులై 15కు వచ్చేసరికి నార్మల్ కంటే 17.1 శాతం ఎక్కువ వర్షం నమోదైంది. అప్పుడు కూడా నెల్లూరు తక్కువ వర్షం కేటగిరీలోనే ఉంది. జులై 29కి వచ్చేసరికి అన్ని జిల్లాలూ నార్మల్ కిందకొచ్చాయి. రాష్ట్ర సరాసరి 16.6 శాతం ఎక్కువ వర్షం పడింది. ఇప్పటికి 279.8 మిల్లీమీటర్లకు 240 మిమీ కురిసింది.ఖరీఫ్‌లో వరి తర్వాత వేరుశనగ, పత్తి సేద్యం ఎక్కువ. సాధారణంగా ఈ రెండు పంటల సాగు జులై నెలాఖరుకల్లా పూర్తయిపోతుంది. కానీ ఈ మారు బాగా మార్పొచ్చింది. తొలకరి వానలకు అనంతపురం, ఇతర రాయలసీమ జిల్లాల్లో వేరుశనగ వేస్తారు. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లలో అధిక వానలు పడి పంట నష్టం జరిగినందున, మధ్యమధ్య డ్రైస్పెల్ సైతం నెలకొన్నందున వేరుశనగ సాగుపై రైతులు అనాసక్తిగా ఉన్నారు. కొంచెం ఆలస్యంగా సాగు చేయాలన్న ఆలోచనా చేస్తున్నారు. ఆ రీత్యా సాగు గణనీయంగా తగ్గింది. నిరుడు ఈ పాటికి 6.77 లక్షల హెక్టార్లలో సాగు కాగా ఈ తడవ 3.27 లక్షల హెక్టార్లలోనే పడింది. నిరుడు కంటే సగానికిపైగా సాగు తగ్గింది. సీజన్ నార్మల్ సాగులో 46 శాతమే వేశారు. ఒక్క అనంతపురంలోనే నిరుడు ఈ వేళకు 4.55 లక్షల హెక్టార్లలో సాగవగా ఈ సంవత్సరం 1.76 లక్షల హెక్టార్లు సాగైంది. వేరుశనగ తగ్గడంతో మొత్తంగా నూనెగింజల సాగుపై ప్రభావం పడింది.

# టీడీపీలో కోవర్టుల కలకలం

గుంటూరు, ఆగస్టు 2, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీలో కోవర్టుల కలకలం రేగుతుంది. పార్టీలోనే ఉంటూ అధికార వైసీపీకి సహకరించేవారు ఉన్నారన్న అనుమానం నిజమవుతుంది. ఇటీవల వరసగా జరుగుతున్న అనేక సంఘటనలు ఇందుకు ఉదాహరణగా నిలిచాయి. పార్టీ అంతర్గత సమావేశాల్లో జరుగుతున్న విషయాలు కూడా బయటకు లీకవుతుండటంతో చంద్రబాబు అప్రమత్తమయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సాంకేతిక సిబ్బంది వరకూ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ పీకల్లోతు కష్టాల్లో ఉంది. ఇప్పటికీ బలమైన ఓటు బ్యాంకు ఉన్న తెలుగుదేశం పార్టీకి నాయకత్వ సమస్య వెంటాడుతుంది. చంద్రబాబు తర్వాత ఎవరు? అన్న ప్రశ్న సీనియర్ నేతల నుంచి జూనియర్ ల వరకూ వేధిస్తుంది. అధికారం కోల్పోయిన రెండేళ్లలో నేతలంతా పెద్దగా యాక్టివ్ గా లేరు. అలాగని పక్క చూపులు చూడటం లేదు. ఎన్నికల సమయానికి నియోజకవర్గాల్లో చెలరేగిపోతామని వారు సమావేశాల్లో చెబుతున్నారు.అయితే ఇటీవల కాలంలో పార్టీ అంతర్గతంగా జరుగుతున్న చర్చలు కూడా లీకవుతున్నాయి. ఇది చంద్రబాబుకు ఆందోళన కల్గిస్తుంది. ఇటీవల కాలంలో కరోనా కారణంగా చంద్రబాబు ఎక్కువగా జూమ్ మీటింగ్ లను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమావేశాల్లో కెమెరా ఆఫ్ అయినా వీడియోలు మాత్రం బయటకు వస్తుండటం కలవర పరుస్తుంది. కొందరు కావాలని పనిగట్టుకుని నేతల సంభాషణలను సోషల్ మీడియాలో పెడుతున్నారని అనుమానిస్తున్నారు. ఇందుకు సాంకేతిక సిబ్బంది సహకారం ఉండి ఉండవచ్చని కూడా టీడీపీ నేతల్లో సందేహం ఉంది. అందుకే చంద్రబాబు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి తన వద్ద పనిచేస్తున్న సాంకేతిక సిబ్బంది విషయంలో జాగ్రత్తగా ఉండాలని భావిస్తున్నారు. రాజధాని అమరావతి భూ కుంభకోణం కేసులో కూడా వైసీపీ నేతలకు ఉప్పందించింది కూడా టీడీపీ నేతలేనన్న అనుమానం ఉంది. దీంతో చంద్రబాబు మరింత అప్రమత్తమయ్యారు. మరి టీడీపీలో కోవర్టులు ఎవరు? అన్న దానిపై పార్టీ అంతర్గతంగా విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోందిమళ్లి కొత్త కష్టాలుప్రధాన ప్రతిపక్షం టీడీపీ.. ఏపీ అధికార పక్షం వైసీపీపై పైచేయి సాధించేందుకు ఉన్న ఏకైక వేదిక శాసన మండలి. 2019 ఎన్నికలలో కేవలం 23 మంది ఎమ్మెల్యేలకు మాత్రమే పరిమితమైన టీడీపీ.. వీరిలోనూ నలుగురిని నిలబెట్టుకోలేక పోయింది. దీంతో అసెంబ్లీలో వైసీపీదే పైచేయి అయింది. దీంతో ఏం మాట్లాడినా.. అసెంబ్లీలో టీడీపీకి వాయిస్ ఉండడం లేదు. పైగా స్పీకర్ నుంచి ఎదురవుతున్న సస్పెన్షన్లు, అరెస్టులు కామన్‌గా మారిపోయాయి. దీంతో టీడీపీ అసెంబ్లీలో జీరో అయిపోయిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.అయితే.. శాసన మండలిలో మాత్రం టీడీపీ బలంగా ఉంది. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో పాటు భారీ సంఖ్యలో ఎమ్మెల్యే స్థానాలను దక్కించుకున్న నేపథ్యంలో మండలిలో గణనీయంగా టీడీపీకి ప్రాధాన్యం లభించింది. దీంతో వైసీపీ సర్కారుకు 151 మంది ఎమ్మెల్యేలు ఉండి కూడా మూడు రాజధానులు, ఏపీ సీఆర్డీఏ చట్టం రద్దు వంటి కీలక నిర్ణయాల విషయంలో మండలిలో టీడీపీ నుంచి తీవ్ర వ్యతిరేక త ఎదురైంది. ఈ క్రమంలోనే తీవ్ర అసహనానికి గురైన సీఎం జగన్.. మండలి రద్దుకు ప్రతిపాదించారుఇలా.. అటు అసెంబ్లీలో కాకపోయినా.. మండలిలో అయినా టీడీపీ.. అధికార వైసీపీపై పైచేయి సాధించేందుకు ప్రయత్నించింది. అయితే.. ఇప్పుడు రాను రాను మండలిలో టీడీపీ నేతలు తగ్గిపోతున్నారు. ఈ ఒక్క నెలలోనే శాసన సభ్యుల కోటాలో మూడు సీట్లు ఖాళీ అవగా.. గవర్నర్ కోటాలో నాలుగు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ ఖాళీ అయిన సీట్లన్నీ కూడా టీడీపీవే కావడం గమనార్హం. ఇక, ఇటీవలే మండలి చైర్మన్ కూడా రిటైరయ్యారు. సో.. దీంతో టీడీపీకి పెద్దల సభలో వాయిస్ తగ్గిపోతోంది.మరో మూడు మాసాల్లో.. వైసీపీ బలం మరింత పెరగనుంది. దీంతో టీడీపీ వాయిస్ పూర్తిగా సన్నగిల్లడం ఖాయమని అంటున్నారు పరిశీలకులు. ప్రస్తుతం వాయిస్ బాగానే వినిపిస్తున్న నారా లోకేష్‌కు నిన్నటి వరకు చేదోడుగా ఉన్న నేతలు కూడా రిటైర్ అవుతుండడంతో మండలిలో లోకేష్ వాయిస్ కూడా తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. సో.. మొత్తంగా 2019 ఎన్నికల్లో తగిలిన దెబ్బ తాలూకు గాయాలు.. టీడీపీని మరింత వేధించనున్నాయన్న మాట.. అంటున్నారు పరిశీలకులు.

## సజ్జలను , మంత్రి బాలినేని లను కలిసిన కోటం రెడ్డి బ్రదర్స్

నెల్లూరు ఆగస్టు 2, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లాకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణా రెడ్డి, అటవీ, విద్యుత్ శాఖ మరియు జిల్లా ఇంఛార్జ్ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి లను సోమవారం ఆర్ & బి అతిథిభవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిరువురిని పుష్పగుచ్ఛం అందజేసి , శాలువాతో సత్కరించారు. ఈ ఈ సందర్భంగా నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా జిల్లా అభివృద్ధికి తోడ్పాటు వివిధ ప్రాజెక్టులు, పరిశ్రమలు మంజూరు చేసినట్లయితే జిల్లాలోని నిరుద్యోగ యువత శాతాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయమై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అభినందనీయమని ప్రభుత్వ సేవలను కొనియాడారు. రానున్న ఎన్నికల నాటికి నెల్లూరు గ్రామీణ నియోజవర్గ లో లో వైకాపాకు తిరుగులేని మెజారిటీ తీసుకురావడమే లక్ష్యంగా నూతన చేరికలు మరియు మార్పులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్చార్జి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ బెయిల్ టెన్షన్...

విజయవాడ, ఆగస్టు 2, (న్యూస్ పల్స్)గన్ బెయిల్ రద్దు అవుతుందా లేదా అన్నది తెలియడానికి ఆగస్ట్ 25 వరకూ అంతా ఎదురుచూడాల్సిందే. ఆ రోజున సీబీఐ కోర్టు తీర్పు వెలువడనుంది. సరే ఈ విషయంలో అధికార వైసీపీ ఫుల్ టెన్షన్ తో ఉంటుంది అన్నది తెలిసిందే. ఎందుకంటే జగన్ కర్త, కర్మ, క్రియగా ఉన్న వైసీపీ బెయిల్ రద్దు కాకూడదు అంటూ వేయి దేవుళ్లకు మొక్కుకుంటోంది. అలా జరగదులే అన్న ధీమా కూడా ఎక్కడో ఉండి కూడా ఉంటుంది. సరే తీర్పు ఎలా వచ్చినా దానిని స్వీకరించాల్సినది, ఆ భారాన్ని మోయాల్సినది వైసీపీనే. కానీ చిత్రంగా వైసీపీకి పూర్తిగా వ్యతిరేకించే టీడీపీ క్యాడర్ కూడా జగన్ బెయిల్ రద్దు కాకూడదు మహాప్రభో అంటోందిట. మరో వారం రోజులు మాత్రమే గడువు ఉంది. ఇక్కడే ఉంది మతలబు అంటున్నారు.మీడియా వేదికగా దీని మీద టీడీపీ తమ్ముళు ఒక్క లెక్కన నినదిస్తున్నారు. జగన్ బెయిల్ రద్దు కాకూడదు, ఆయన పూర్తి కాలం ఏపీకి సీఎం గా ఉండాలని వారు గట్టిగా కోరుకుంటున్నారు. ఇప్పటికే ఇంటర్వెల్ దాకా వచ్చిన వైసీపీ సినిమా క్లైమాక్స్ లో ఎన్నో ట్విస్టులు ఉంటాయి. జగన్ వాటిని చూడాలి, జనాలకు కూడా జగన్ పాలన మీద భ్రమలు తొలగాలి అంటే ఆయనే సీఎం గా ఉంటూ 2024 ఎన్నికలకు వెళ్లాలని కోరుకుంటున్నారుట. ఏపీ అప్పుల పాలు అయిందని, అభివృద్ధి అన్నదే లేదని, ఈ రోజున అన్ని రకాలైన సమస్యలు పొంచి ఉన్నాయని సోషల్ మీడియాలో తమ్ముళ్ళు బాగానే విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో బెయిల్ రద్దు అయి జగన్ జైలుకు వెళ్తే వైసీపీ నెత్తిన పాలు పోసినట్లే అని కూడా వారు లాజిక్ పాయింటే తీస్తున్నారు.పొరపాటున బెయిల్ రద్దు అయి జగన్ జైలు కి వెళ్తే టీడీపీకి ఉన్న ఒక్క ఛాన్స్ అధికారం కూడా పోయినట్లేనని కూడా వారు అంటున్నారు. ఒక విధంగా ఇదే నిజం కూడా. జగన్ జైలు కి వెళ్తే ఏపీలో రాజకీయ సంక్షోభం వస్తుంది. గట్టిగా ఆరు నెలలు తిరగకుండానే సర్కార్ కుప్ప కూలుతుంది. ఆ తరువాత మళ్లీ జగన్ నే జనాలు ఎన్నుకుంటారు. కుట్ర పన్ని జగన్ని జైలుకి పంపారన్న సానుభూతి వెల్లువలా వ్యాపిస్తుంది. గతంలో జగన్ జైలుకు వెళ్ళబట్టే విపరీతమైన సింపతీ వచ్చింది. ఆ విషయం తెలుసు కనుకనే సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వంటి వారు జగన్ బెయిల్ రద్దు పోరాటం ఎందుకు రాజు గారూ అని రఘురామ మీద చిరాకు పడ్డారు. మరి తమ్ముళ్ల లాజిక్ టీడీపీ పెద్దలకు తెలియదా, వారు నిజంగనే జగన్ జైలుకు వెళ్ళాలని కోరుకుంటున్నారా అన్నదే అర్థం కాని విషయం.ఇక వైసీపీ విషయానికి వస్తే ఆ పార్టీ పూర్తి టెన్షన్ లో ఉందా అన్న చర్చ వస్తోంది. జగన్ వన్ టూ టెన్ గా పార్టీలో ఉన్నారు. ఆయన కనుక బెయిల్ రద్దు తో జైలు కి వెళ్తే భార్య భారతిని పెట్టినా కూడా ప్రభుత్వం నిలబడదు, దానికి మించి పాలన కూడా ఇప్పటికే ఇబ్బందులలో ఉంది. ఆర్ధికపరమైన ఇక్కట్లను చక్కబెట్టడం కూడా ఎవరి వల్లా కాదు, జగన్ సీఎం గా ఉంటే ఏదో రకంగా నడుపుకుని రావచ్చు. ఇక గట్టిగా రెండేళ్ళ పాలన పూర్తి చేసుకున్న ఎమ్మెల్యేలు అయితే మళ్ళీ ఎన్నికలకు రెడీ అవడానికి వెనకంజ వేస్తారు. దాంతో ఎలా చూసుకున్నా జగన్ బెయిల్ రద్దు కావద్దు అన్నదే వైసీపీలో మాట

## జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి

కోసిగి ఆగస్టు 2, (న్యూస్ పల్స్)అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో కస్తూర్బ గాంధీ హాస్టల్ ప్రధాన ఉపాధ్యాయురాలు పుష్పలత చేతులు మీదుగా హాస్టల్ నందు మొక్కలు నాటారుఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.ఈరేష్ మాట్లాడుతూ పింగళి వెంకయ్య ఆంధ్ర ప్రదేశ్ కృష్ణాజిల్లా బట్ల పెనుమర్రు గ్రామంలో ఆగస్టు 2న జన్మించారు 1936 నాటి 'యంగ్ ఇండియా' పింగళి వెంకయ్యను ప్రత్యేకంగా గాంధీజీ ప్రశంసించారు. 19 ఏళ్ల వయసులోనే ఆఫ్రికాలో ఆంగ్లో-బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. ఆ సమయంలోనే మహాత్ముడితో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత 50 ఏళ్ల పాటు అది కొనసాగింది. వెంకయ్య సన్నిహితులు ఆయన్ను జపన్ వెంకయ్య, పత్తి వెంకయ్య, జనద వెంకయ్య అని పలు రకాలుగా పిలుచుకునేవారు.పింగళి వెంకయ్య గొప్ప దేశభక్తుడు, జియాలజిస్ట్, రచయిత కూడా. 1911-44 వరకు బందరు జాతీయ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో భూగర్భ శాస్త్ర పరిశోధనలు చేసి డిప్లొమా పొందారు. 1924 నుంచి 1944 వరకు నెల్లూరులో మైకా గురించి పరిశోధనలు చేశారు. బొగ్గు వజ్రంగా మారే విధానాన్ని గురించి 'తల్లిరాయి' అనే పుస్తకం రాశారు. 1916లో 'భారతదేశానికి ఒక జాతీయ పతాకం' అనే పుస్తకాన్ని రచించారు. ఈ గ్రంథంలో సుమారు 30 రకాల పతాకాలను ప్రదర్శించారు.బెజవాడ 1921లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు జరిగినప్పుడు గాంధీజీ.. వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు, మధ్య రాట్నం గల ఒక జెండాను రూపొందించాలని కోరారు.సూచనాలతో ఒక జెండాను వెంకయ్య రూపొదించగా.. సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శనమైన తెలుపు రంగు కూడా ఉండాలని అభిప్రాయపడ్డారు. దీంతో వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు. ప్రోద్బలంతో త్రివర్ణపతాకం పుట్టింది బెజవాడలోనే. కాషాయం హిందువులకు చిహ్నమని, ఆకుపచ్చ ముస్లింలకని పేర్కొనడంతో, ఇతర మతాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలనే అభిప్రాయం వెలువడడంతో ఆకుపచ్చ, కాషాయ రంగులుతో పాటు తెలుపు రంగు కూడా చేర్చి త్రివర్ణ పతాకాన్ని పింగళి వెంకయ్య గారు రూపొందించారు. మధ్యనున్న రాట్నం గ్రామ జీవనాన్ని, రైతు కార్మికత్వాన్ని స్ఫురింపజేస్తుందన్నారు. కార్మిక, కర్షకులపై ఆధారపడిన భారతదేశం, సత్య హింసలను ఆచరించడంతో సుభిక్షంగా ఉంటుందని మన ఆశయం. ఆ ఆశయ చిహ్నమే మన త్రివర్ణ పతాకం. ఆగస్టు 2న ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయుడి సేవలను స్మరించుకుందాం. ఈ కార్యక్రమంలో, ఒతిబట నాయకులు హాజీ, మంజునాథ్ ,అంజి. జోన్సన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## డెల్టా ప్లస్ వేరియంట్‌పై కొవాగ్జిన్ ప్రభావవంతం: ఐసీఎంఆర్




న్యూఢిల్లీ : భారత్ బయోటెక్ కంపెనీ తయారు చేసిన కొవాగ్జిన్ టీకా డెల్టా ప్లస్ వేరియంట్‌పై ప్రభావంతంగా పని చేస్తున్నట్లు ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) నిర్వహించిన అధ్యయనంలో తేలింది. హైదరాబాద్‌కు చెందిన ఫార్మా దిగ్గజం భారత్ బయోటెక్ కంపెనీ కొవాగ్జిన్ టీకాను ఐసీఎంఆర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ సహకారంతో తయారు చేసింది.కొవాగ్జిన్ రోగ లక్షణాలున్న వ్యక్తుల్లో 77.8శాతం ప్రభావం చూపగా.. కొత్త డెల్టా వేరియంట్‌కు వ్యతిరేకంగా 65.2శాతం రక్షణ కల్పించిందని భారత్ బయోటెక్ జూలైలో తెలిపింది. తీవ్రమైన కేసులపై వ్యాక్సిన్ 93.4శాతం సమర్థతను ప్రదర్శించిందని కంపెనీ వివరించింది. కొవిడ్-19 డెల్టా వేరియంట్ ప్రపంచదేశాలను వణికిస్తోంది. భారత్‌లో సెకండ్ వేవ్‌కు ఈ వేరియంట్ కారణమని తేలగా.. ప్రస్తుతం 132 దేశాలకు విస్తరించింది. ప్రస్తుతం అగ్రరాజ్యం అమెరికా, జపాన్, సింగపూర్ సహా పలు దేశాలను వణికిస్తున్నది.

## అనంతపూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం:: ముగ్గురు మృతి

అనంతపూర్ ఆగష్టు 2 ఏపీలోని అనంతపూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జిల్లాలోని గుత్తి జాతీయ రహదారిపై జీపు, లారీ ఢీకొట్టుకొన్నాయి. ఈ ఘటనలో జీపులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను గుల్బర్గాకు చెందిన వారిగా గుర్తించారు. జీపులో అనంతపూర్ నుంచి కర్నూలుకు వెళ్తుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ కారును ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. లారీ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జవగా.. లారీ రోడ్డుపై బోల్తాపడింది. జీపులోనే మృతదేహాలు చిక్కుపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు. ఘటనలో మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా.. అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులను అష్రఫ్ అలీ (68), లాయక్ అలీ (45)గా గుర్తించారు.

## కోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎండోమెంట్ అధికారులు

### 20న హైకోర్టుకు హాజరుకావాలని ఆదేశాలు జారీ

నెల్లూరు ఆగస్టు 2, (న్యూస్ పల్స్) హైకోర్టు ఉత్తర్వులను దిక్కరించిన దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ రామచంద్ర మోహన్ మరియు పెంచలకోన దేవాలయ కార్యనిర్వాహణాధికారి జె .వెంకటసుబ్బయ్య లను ఈనెల 20న వ్యక్తిగతంగా హైకోర్టుకు హాజరుకావాలని జడ్జి జి. రమణ ఆదేశాలు జారీ చేశారు . ఈ మేరకు ఫిర్యాదుదారులు మాముడూరు నరసింహులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు నెల్లూరు జిల్లా ,రాపూరు మండలం పెంచలకోన లో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ పెనుశిల లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో వంశపారంపర్య కళ్యాణ కట్ట మిరాశి దారులుగా మాముడూరు పెంచల స్వామి తండ్రి నరసింహులు మరియు ఆయన కుమారుడు ప్రేమ్ సాయి లు కల్యాణకట్ట తలనీలాలు కార్యక్రమం నిర్వహిస్తున్నారు . ఈ క్రమంలో వీరికి 13 నెలలుగా కళ్యాణ కట్ట తలనీలాల కు సంబంధించిన బకాయిలను దేవాలయ కార్యనిర్వహణాధికారి చెల్లించకపోవడంతో 2020 ఆగస్టు నెలలో హైకోర్టు నందు కంటెంట్ కేసు( పిటిషన్) పెట్టి ఉన్నారు. ఈ విషయమై హైకోర్టు విచారణలో భాగంగా సంబంధిత బకాయిలను వెంటనే చెల్లించాలని దేవాదాయ శాఖకు ఆదేశించడం జరిగింది. హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ సంబంధిత బకాయిలు దేవదాయ శాఖ చెల్లించేందుకు ఆమోదించినప్పటికీ ఇంతవరకు చెల్లించలేదు. ఈ విషయమై హైకోర్టు నుంచి కోర్టు ఉత్తర్వులు దిక్కరించిన దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ రామచంద్ర మోహన్ మరియు పెంచలకోన దేవాలయ ఈవో వెంకటసుబ్బయ్య ఈనెల 20న( ఆగస్టు) వ్యక్తిగతంగా హైకోర్టు కు హాజరు కావలసిందిగా హైకోర్టు జడ్జి ఆదేశాలు జారీ చేశారు.......ఈ విషయమై పెంచలకోన దేవాలయ ఈవో వెంకటసుబ్బయ్య ఉదయం న్యూస్ ప్రతినిధి చరవాణి ద్వారా వివరణ కోరగా ఆ విషయాలు తర్వాత మాట్లాడతానని మొహం చాటేయడం జరిగింది.

## లిచిపోయిన రోడ్డు పనులు చేపట్టాలి

### ఎంపిడివో కు సర్పంచ్ చిన్నబాబు వినతి పత్రం

విశాఖపట్నం ఆగస్టు 2, (న్యూస్ పల్స్)అరకు వేలి మండలం సుంకర మెట్ట పంచాయితీ సమగ్ర అభివృద్ధి కోసం మండల అభివృద్ధి అధికారి ఎంపిడిఓ సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్న బాబు చర్చించడంతో పాటు సమస్యలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సుంకరమెట్ట పంచాయతీలో ప్రధానమైన సమస్యలు అన్ని గ్రామాలకు పరిష్కారం కోసం సబ్ ప్లాన్ నిధులు, రూర్బన్ నిధులు పూర్తిస్థాయిలో కేటాయించి పంచాయతీ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు.. అలాగే రైతులు సాగుచేస్తున్న పంట పొలాలకు సకాలంలో నీరు అందించడం కోసం చెక్ డ్యాం లు మరమ్మతులు చేయలన్నారు . కిన్నంగుడ నుండి దండ బాడు మీదుగా దుక్కగుడ వరకు పెండింగ్లో ఉన్న రోడ్డు పనులు వెంటనే చేపట్టాలన్నారు బస్కి పంచాయతీ కొత్రాగుడ నుండి లింబగుడ వరుకు ఉన్న రోడ్డు సమస్య పరిష్కారం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెమ్మెలి చిన్న బాబు సిపిఎం నాయకులు పాంగి రాజు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు తదితరులు పాల్గొన్నారు

## బనగానపల్లి లో టీడీపీ ర్యాలీ

కర్నూలుఆగస్టు 2, (న్యూస్ పల్స్)బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉపాధి హామీ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అయన స్థానిక ఎంపీడీవో కు వినతి పత్రం అందచేసారు. ప్రభుత్వంపై నమ్మకం కోల్పోవడం తోనే పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. కక్ష సాధింపు చర్య తోనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్య మొండి వైఖరితో బిల్లులు చెల్లించకపోవడంతో అనేకమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారు. అరకొరగా అక్కడక్కడ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు వస్తే వైసిపి కమిషన్ల రెడ్డి కాచుకొని కూర్చున్నాడని ఎద్దేవా చేసారు.

## ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి

విజయవాడఆగస్టు 2, (న్యూస్ పల్స్)ప్రకాశం బ్యారేజీ వద్ద క్రమక్రమంగా వరద ఉధృతి పెరుగుతుంది. 80 వేల క్యూసెక్కుల నీరూ దిగువకు విడుదల చేసారు. సాగునీటి అవసరాల కోసం కృష్ణ ఈస్ట్రన్ మరియు వెస్ట్రన్ కాలువలకు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసారు. ఇన్ ఫ్లో క్యూసెక్కుల 83139 ఔట్ ఫ్లో 73890, 30 గేట్లను 2 అడుగుల మేర,40 గేట్లను 1అడుగు మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమైయ్యారు. నదీ పరివాహక ప్రాంత ప్రజల్ని అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె నివాస్ సూచించారు.

## ఎమ్మెల్యే రోజాకు పూలాభిషేకం

చిత్తూరు ఆగస్టు 2, (న్యూస్ పల్స్)నగరి శాసన సభ్యురాలు ఆర్.కె. రోజా సోమవారం వడమాలపేట మండలం తట్నేరి నందు ఆసియన్ అభివృద్ధి బ్యాంకు నిధులు 43 లక్షల రూపాయలతో నిర్మించిన పాదిరేడు- ఎల్.ఎం కండిగ వయా తట్నేరి నుంచి తట్నేరి దళిత వాడ రోడ్డు ను ప్రారంభించారు. వైఎస్సార్ జగనన్న కాలనీల గృహనిర్మాణం కోసం నిరుపేదలైన లబ్దిదారులకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ఒకొక్కరికి 30 వేల రూపాయల వంతున ఎమ్మెల్యే ఆర్.కె.రోజా పంపిణీ చేశారు. పాదిరేడు- ఎల్.ఎం కండిగ వయా తట్నేరి నుంచి తట్నేరి దళిత వాడ రోడ్డు నిర్మాణంను ఆసియన్ అభివృద్ధి బ్యాంకు ద్వారా చేయించినందుకు కృతజ్ఞతతో ఎమ్మెల్యే ఆర్.కె.రోజా ను స్థానికులు పూలాభిషేకం చేసి ఘనంగా సత్కరించారు

## నార్పల పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

### పోలీసుస్టేషన్లు, రికార్డుల నిర్వహణపై లోతుగా పరిశీలన

అనంతపురం ఆగస్టు 2, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా నార్పల పోలీసు స్టేషన్ ను సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ , పరిసరాలను సందర్శించి పోలీసుస్టేషన్ నిర్వహణ మరియు రికార్డుల నిర్వహణపై లోతుగా పరిశీలించారు. విధుల్లో భాగంగా పోలీసులు మెయింటేన్ చేసే ప్రతీ రికార్డును సమీక్షించారు. అనంతరం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని పరిస్థితులను ఎస్సై వెంకట ప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రత్యేక నిఘా వేయాలన్నారు. అక్రమ మద్యం, ఇసుక... మట్కా, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ , తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పని చేయాలన్నారు. అవినీతికి తావులేకుండా అంకితబావంతో ప్రజలకు సేవ చేయాలన్నారు.

## ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

### టిడిపి నాయకులు జెన్నీ రమణయ్య

నెల్లూరు ఆగస్టు 2, (న్యూస్ పల్స్) రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంఛార్జి అబ్దుల్ అజీజ్ ఆదేశాల మేరకు స్థానిక నెల్లూరు రూరల్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కి ఉపాధి హామీ పనుల బిల్లులు వెంటనే చెల్లించాలని రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా జెన్నీ రమణయ్య మాట్లాడుతూరాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశించిన కూడా ప్రభుత్వం నరేగా బిల్లులు చెల్లించకపోవడం ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు నిదర్శనం అని అన్నారు.తక్షణమే నరేగా బిల్లులు విడుదల చేసి కాంట్రాక్టర్లు ను ఆదుకోవాలని కోరారు.ప్రభుత్వం పార్టీలకు అతీతంగా రాజకీయ కక్ష్యలు మానుకొని బిల్లులు చెల్లింపులు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి కార్యదర్శి ఊరందూరు సురేంద్రబాబు, మాలమహానాడు నాయకులు గంగాధర్,ఈధర శ్రీనివాసులు, ముస్లిం మైనార్టీ నాయకులు సాబీర్ ఖాన్,సారంగి గున్నయ్య, భాస్కర్ రెడ్డి, సురేష్ రెడ్డి, నరసింహులు, శశిధర్, ఆనంద్ ,చెంచయ్య, నవీన్, మోహన్ రావువెంకట్ రత్నం ,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు సేంద్రియ ఎరువుల తో సాగు చేయాలి

### గురునాధ్ రెడ్డి

### సేంద్రియ పద్దతిలో సాగు చేస్తే అధిక దిగుబడులు

### చంద్ర శేఖర్

కౌతాళం ఆగస్టు 2, (న్యూస్ పల్స్) ప్రతి రైతు పంట పొలాలలో సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తే ,అధిక దిగుబడులు రాబడుతాయని రైతులు సేంద్రియ ఎరువుల పై అవగాహన కల్పించుకోవాలి బాపురం సర్పంచ్ గురునాధ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రైతుల సేంద్రియ ఎరువుల అవగాహన కార్యక్రమాలు లో పాల్గొన్నారు. వింఫీనిత్ ఫీల్డ్ అసిస్టెంట్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ అధిక కెమికల్ మందులు ఎరువుల వాడటం వల్ల పంట పొలంలో భూసారం తగ్గిపోదుందని అధిక యూరియా వాడటం వల్ల భూమి లోపల సున్నముగా మారిపోయిందని దిగుబడులు తగ్గి రైతులకు రాబడి తగ్గిందని వాపోయారు. అందుకే రైతులు సేంద్రియ పద్ధతి లో సాగు చేస్తే ఆదాయం తగ్గించి ఎక్కువ దిగుబడులు పొందుతారని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడటం వల్ల అధిక రాబడులు, అధిక దిగుబడులు వస్తాయని రైతులకు సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూమిలో అధిక సారావంతం చేయడానికి నేలను మెత్తదానం కలిగిస్తుందని, నత్రజని పొటాషియం,కార్బన పదార్థాలను భూమిలో కలిగిస్తుందని ,భూమిలో వైరస్ ను రాకుండా అపుతుందని ఇంతకు ముందు కరగని ఆకార్బన పదార్థాలను కలిగిస్తోందని సేంద్రియ ఎరువుల ఎక్కువ మోతాదులో వాడటం వల్ల పొలానికి, గాని, మనుషులకు గాని లేదా వాతావరణం కి గాని హానికలించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురునాధ్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, చంద్ర శేఖర్ ఉన్నారు.

# ఉపాధి హామీ పెడింగ్ బిల్లులు విడుదల చేయాలి..

నందికొట్కూరు. ఆగస్టు 02( విభారె) కోర్టు ఆదేశాలకు అనుగుణంగా వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో సోమవారం నందికొట్కూరు పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలోని ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు.అందులో భాగంగానే నంద్యాల పార్లమెంటు తెలుగు దేశం పార్టీ ఇంచార్జీ మాంద్ర శివా నంద రెడ్డి, నంద్యాల పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి పిలుపు మేరకు పెండింగ్ బిల్లులకు సంబంధించి 5 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయంలో టిడిపి నాయకులు అందజేశారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా జూలై నెలాఖరు లోపల ఉపాధి హామీ బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదనిహైకోర్టు ఆదేశాలను పాటించి పెండింగ్ లో ఉన్న ఉపాధి బిల్లులను సత్వరమే ప్రభుత్వం చెల్లించాలని పగిద్యాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పలుచాని మహేశ్వర రెడ్డి, నందికొట్కూరు మండల టిడిపి కమిటీ సభ్యులు జయసూర్య, కన్వీనర్ ఓబుల్ రెడ్డి లు డిమాండ్ చేశారు . గత టిడిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఉపాధి హామీ బిల్లులను వైసిపి ప్రభుత్వం చెల్లించకుండా కుంటి సాకులు చెపుతూ పబ్బం గడుపుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు రాష్ట్ర వైసిపి ప్రభుత్వానికి పెండింగ్ లో ఉన్న ఉపాధి బిల్లులను జులై 31లోపు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో నిధులు వినియోగం, పనిదినాలకల్పన

**ఉపాధి హామీ బిల్లులపై టిడిపి నిరసన కార్యక్రమం..**

, అభివృద్ధిలో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో పలు అవార్డులను తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా ఏపీ నిలిచేటట్లు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేశారన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ, 6125 కోట్ల నిధులతో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఎల్ ఈ డి దీపాలు, గ్రామ పంచాయితీ భవనాలు, స్మశాన వాటికలు, నీరు చెట్టు, పంటకుంటలు, అంగన్ వాడి కేంద్రాలు, చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలు వంటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహించారన్నారు. రూ, 5694 కోట్ల తో సుమారు 40వేల కిలోమీటర్ల సిసి రోడ్లు, గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.. వైసిపి పార్టీ అధికారంలోకి వచ్చాక ఏపీ లోని గ్రామాల అభివృద్ధికి గ్రహణం పట్టిందని, వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జి ఓ నంబర్ 350 తెచ్చి గ్రామాల్లో సుమారురూ, 3118 కోట్ల విలువైన పనులను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేయడం సిగ్గు చేటన్నారు. ఇది పూర్తిగా ఉపాధి హామీ . చట్టం 2005 ప్రకారం విరుద్ధమన్నారు. ఈ చట్టం ప్రకారం వరుస క్రమంలో బిల్లుల చెల్లింపులు చేపట్టాలి. పెండింగ్ బిల్లులకు విజిలెన్స్ విచారణ పేరుతొ చెల్లించకుండా నిధులు లేవు, కేంద్రం ఇవ్వలేదు అని ఏవో కుంటి సాకులు చెప్తున్న వైసిపి దుర్మార్గపు ఆలోచనలకు పరాకాష్ట అని మండి పడ్డారు. కోర్టు ఆదేశాలను అనుసరించి పెండింగ్ లో ఉన్న ఉపాధి బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరుతూ నందికొట్కూరు ఎంపిడిఓ కార్యాలయం లో సూపర్ డెంట్ రాజశేఖర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమం లో మున్సిపల్ కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి,తెలుగు యువత అధ్యక్షులు మద్దిలేటి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ముర్తు జావలి, టిడిపి నాయకులు వేణు, సత్తార్, కళా కర్, మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమప్రాంతంలోని నీటి ప్రాజెక్టుల సాధనకై భారీగా బైక్ ర్యాలీ యాత్ర

**రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ**

కౌతాళంఆగష్టు 02( విభారె) కర్నూలు పశ్చిమప్రాంతంలోని నీటి ప్రాజెక్టుల సాధనకై పల్లె పల్లె కదులుదాం అంటూ సోమవారం రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ (ఖీఅఅ) ఆధ్వర్యంలో కౌతాళం మండలం మేలిగనూరు నుండి ఆదోని ఆర్డీఓ ఆఫీసు వరకు భారీగా బైక్ ర్యాలీ యాత్రను నిర్వహించారు. కౌతాళం లో బిస్మిల్లా సర్కిల్ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నందు విలేకరుల సమావేశం ఏర్పాట్లు నిర్వహించారు ..ఈ సందర్భంగా రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు రామలింగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు లోకేష్,రాష్ట్ర నాయకులు నాగరాజు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో కర్నూలు పశ్చిమ ప్రాంతంలో నీరు లేక ప్రజలు సుగ్గి కు,వలసలకు వెళ్లి కుటుంబ పోషణ భారంతో రైతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటారున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న పులికనుమ ప్రోజెక్టు సామర్థ్యాన్ని ఐదు టీఎంసీలకు పెంచాలని ,వేదవతి ప్రాజెక్టు సామర్థ్యాన్ని 8 టీఎంసీ లకు పెంచి నిర్మించాలని,మేలిగానూరు దగ్గర 50 టీఎంసీ లతో వరద కాలువను నిర్మించి ఈ ప్రాంతానికి త్రాగునీరు, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.పై డిమాండ్ల సాధనకై ,కర్నూలు పశ్చిమ ప్రాంతంలోని కరువు,వలసలను నివారించాలని కోరుతూ సోమవారం నిబంధనలు పాటిస్తూ కేవలం 10 బైక్ లతో మేలిగానూరు నుండి ఆదోని ఆర్డీఓ ఆఫీస్ వరకు బైక్ యాత్రను నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని రైతన్నలు,ప్రజలు,ప్రజాసంఘాలు మద్దతు తెలియజేసి విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశానికి రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహయ్య,ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సుజ్ఞానమ్మ, బి. సి.ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు గారు పాల్గొని తమ ప్రజాసంఘాల సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ యువజన వేదిక నాయకులు రవి వర్మ,నవీన్,అనిల్,శేఖర్,ప్రతాప్ పాల్గొన్నారు.

## రైతులు సాగుచేసిన ప్రతి పంటకు ఈ- క్రాపింగ్ తప్పనిసరి...

**ఏడిఏ మహమ్మద్ ఖాద్రి**

తుగ్గలి ఆగష్టు 02( విభారె) మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన ప్రతి ఒక్క పంటకు ఈ క్రాపింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని పత్తికొండ ఎడిఎ మహ్మద్ ఖాద్రి తెలియజేశారు.ఈ సందర్భంగా సోమవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం నందు వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ఈ క్రాపింగ్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సోమవారం రోజున వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహిస్తున్న పంట నమోదు ప్రక్రియను ఏడిఏ మరియు ఏవో లు పరిశీలించారు.ఈ సందర్భంగా ఏ డి ఏ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి ఒక్క రైతు సాగు చేసిన తమ పంటలను వ్యవసాయ అధికారుల ద్వారా నమోదు చేయించుకోవాలని అని తెలియజేశారు.ఈ క్రాప్ బుకింగ్ అనంతరం రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి 1బి జిరాక్స్,మొబైల్ నెంబర్,ఆధార్ కార్డు లను పొలం ఉన్న రైతు తీసుకొని వెళ్లి సాగుచేసిన పంటను నమోదు చేసుకోవాలని తెలియజేశారు.ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా,రైతు భరోసా,క్రాప్ లోన్ మరియు పంట నష్టపరిహారం వంటి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఆయన తెలియజేశారు. ఈ క్రాప్ చేసుకొని రైతులకు ఎటువంటి ప్రభుత్వ పథకాలు వర్తించవని ఆయన తెలియజేశారు. కావున రైతులందరూ త్వరితగతిన పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్, హబ్ ఏవో రామాంజనేయులు,హబ్ ఏఈఓ సంజీవ్ కుమార్,వ్యవసాయ విస్తరణాధికారులు రంగన్న,లక్ష్మీ చైతన్య,ఎంపీఈవో లు,విఏఏ లు, విహెచ్ఎ లు మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 4 నుండి 6వ తేదీ వరకు శ్రీ కోదండరామాలయంలో పవిత్రోత్సవాలు

తిరుపతి, ఆగస్టు 02 విభారె) తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఆగస్టు 4 నుండి 6వ తేదీ వరకు పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగనున్నాయి. ఇందుకోసం ఆగస్టు 3న ఉదయం ఆచార్య రుత్విక్‌వరణం, సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, మేదినిపూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహిస్తారు. కోవిడ్ - 19 వ్యాప్తి నేపథ్యంలో ఆలయంలో ఏకాంతంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆగస్టు 4న మొదటిరోజు యాగశాలలో పవిత్ర ప్రతిష్ట, శయనాధివాసం, ఆగస్టు 5న రెండో రోజు పవిత్ర సమర్పణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆగస్టు 6న మూడో రోజు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈ మూడు రోజుల పాటు ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీ సీతారామ సమేత లక్ష్మణస్వామివారి ఉత్సవమూర్తులకు ఏకాంతంగా స్నపనతిరుమంజనం జరుగనుంది. సాయంత్రం భాష్యకార్ల సన్నిధిలో ఆస్థానం చేపడతారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు.

## ఉపాధి హామీ పథకం పెడింగ్ వున్న బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి**

కౌతాళం ఆగష్టు 02( విభారె) రాష్ట్ర వ్యాప్తంగా పెడింగ్ వున్న ఉపాధి హామీ పథకం బిల్లులు వెంటనే విడుదల చేయాలని మంత్రాలయం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం (యం పి డి ఓ) ముందు మంత్రాలయం టిడిపి మండల కన్వీనర్ పన్నాగా వెంకటేశప్ప స్వామి అధ్యక్షుతన నిరసన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి సోదరుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నిరసన వ్యక్తం చేశారు తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు మంత్రాలయం నియోజకవర్గం లోని నాలుగు మండలాలు నాయకులు కార్యకర్తలు తో కలిసి తెలుగు దేశం పార్టీ ఆఫీసు నుండి ర్యాలీ గా బయలుదేరి యం పి డి ఓ ముందు నిరసన వ్యక్తం చేస్తూ వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోర్టు జులై 31లోపు చెల్లించాలని చెప్పిన వైయస్సార్ ప్రభుత్వం నిర్లక్ష్యము చేసు ప్రజలను మోసము చేస్తుంది. అని వారు వాపోయారు అలాగే కేంద్రం విడుదల చేసిన ఉపాధి హామీ నిధులను వేరే పథకానికి వాడుకోవడం చాలా విరుద్ధంగా ఉంది. ఇప్పుడు కోర్టు మెట్లు ఎక్కి ఎదో ఒక్కటి సాగు చెప్పుతూ కాలయాపన చేస్తున్నారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు త్వరలోనే పెడింగ్ లో వున్న ఉపాధి హామీ పథకం బిల్లులు విడుదల చేయాలని సమస్యలతో కూడిన వినతి పత్రాని స్థానిక యం పి డి ఓ కార్యాలయం లో ఇచ్చి ఉపాధి హామీ పథకం బిల్లులు వచ్చాంత వరకు మా పోరాటం ఆగదు అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి సురేష్ నాయుడు మంత్రాలయం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు సుదీర్ రెడ్డి పల్లెపాడు రామిరెడ్డి పెద్దకడూబురు మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న బూదురు మల్లికార్జున రెడ్డి తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మంజునాత్ జిల్లా అధికార ప్రతినిధి జ్ఞానేష్ రైతు సంఘం కార్యదర్శి గోపాల్ రెడ్డి మాలపల్లి వెంకటేష్ రమేష్ గౌడ్ మంజు చిలకలడోన హనుమంతు చిన్న భూంపల్లి మాజీ సర్పంచ్ నరసింహులు మదుసూదన్ సూగురు నాగేష్ వగరూరు రామిరెడ్డి అబ్దుల్ కాత్రికి మాజీ సర్పంచ్ చంద్ర ప్రభాకర్ రెడ్డి మేకల నరసింహులు వట్టప్ప గారి నరసింహులు కేశప్ప పంపాపతి బుజ్జి స్వామి మాలపల్లి లక్ష్మన్న లక్ష్మరి రామయ్య బందారి నరసింహులు యస్ సి సెల్ జిల్లా కార్యదర్శి సల్మాన్ రాజు యేబు తెలుగు యువత నాగరాజు రిశి దుద్ది నాగేష్ చిదనంద లింగప్ప ఎరిగేరి రామకృష్ణ నాలుగు మండలాలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ యునాని వైద్యశాలకు మిక్సీ పంపిణీ

గోనెగండ్ల ఆగష్టు 02( విభారె) ప్రభుత్వ యునాని వైద్యశాలలో ఆనందయ్య మందు తయారీ కొరకు వస్తు సామగ్రిలో భాగంగా మిక్సీ అవసరం ఉందని తెలుసుకొని వ్యాపారి ప్రసాద్ శెట్టి యునాని వైద్యులు డాక్టర్ ఎస్.ఎ.ఎస్ ఖాద్రి కి అందించారు, ఈ సంధర్భంగా యునాని వైద్యులు ఖాద్రి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా యువకులు ఆరోగ్యవంతమైన గ్రామం కోసం ముందుకు రావడం హర్షణీయమన్నారు, వ్యాపారి ప్రసాద్ శెట్టి మాట్లాడుతూ భయానక కరోనా భారినపడి ఎందరో మిత్రులు మృత్యువాత పడ్డారని అలాంటి పరిస్థితుల్లో ఆనందయ్య మందు ఎందరికో ఉపశమనం కలిగించిందని ఎక్కడో తయారు చేస్తున్న ఆనందయ్య మందు కోసం వ్యయ ప్రయసాలు పడి ఇబ్బందులు పడే బాధను డాక్టర్ ఖాద్రి తగ్గించారని రాయలసీమ జిల్లాల నుంచి మొట్టమొదటి ఆనందయ్య మందుకు డేమోను అందించిన వైద్యులు మండల ప్రజలకు వైద్యం అందించడం ప్రజల అదృష్టం అన్నారు,

# నిర్మాణ సంస్థపై కోర్టుకు వెళ్లిన హీరోయిన్



సాధారణంగా ఏదైనా అగ్రిమెంట్ జరిగితే దానిలోని కండిషన్న్లు ఇరు వైపుల వారు పాటించాలి. ఒకవేళ ఏ కండిషన్ను పాటించపోతే అగ్రిమెంట్ బ్రేక్ అయ్యే చాన్స్ ఉంటుంది. అయితే సాధారణంగా పెద్ద సంస్థలతో ఇలాంటి అగ్రిమెంట్స్ జరిగితే నిబంధనలు పాటించక పోయినా యాక్సెప్ట్ చేసేస్తుంటారు కొందరు నటులు. కానీ మనం ఇప్పుడు చర్చించబోతున్న ఈ హీరోయిన్ అతి పెద్ద ప్రొడక్షన్ హౌజ్ పై పోరుకు సిద్ధమైంది. నిబంధనలు ఉల్లంఘించడం సరి కాదని తనకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టు మెట్లెక్కింది.ఇంతకీ ఈ హీరోయిన్ ఎవరు? ఆమె పోరాటం ప్రకటించిన నిర్మాణ సంస్థ ఏది? అనే విషయాలు తెలియాలంటే మీరు ఈ స్టోరీని కంప్లీట్గా చదవాల్సిందే. అమెరికన్ ఫేమస్ యాక్ట్రెస్ స్కార్లెట్ జాన్సన్ గతంలో ప్రపంచంలోనే అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకున్న నటిగా గుర్తింపు పొందింది. ఈమె సినిమా వచ్చిందంటే చాలు యాక్షన్ సినీ లవర్స్ హ్యాపీగా ఫీలవుతుంటారు. అంతలా సినీ లవర్స్కు ఇష్టమైన యాక్ట్రెస్ స్కార్లెట్.స్కార్లెట్ ప్రొడక్షన్ హౌజ్ డిస్నీ హాట్ స్టార్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. ఈమె నటించిన 'బ్లాక్ విడో' చిత్రం థియేట్రికల్ రిలీజ్ తర్వాత డిజిటల్ బాట పట్టాలి. కానీ ఆ నిబంధనను అతిక్రమించి నిర్మాణ సంస్థ డిస్నీ హాట్స్టార్ ఒకేసారి థియేటర్లతో పాటు డిజిటల్ రిలీజ్కు సిద్ధం చేస్తోంది. ఈ నిర్ణయం పట్ల స్కార్లెట్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆమె వాదన ప్రకారం..'బ్లాక్ విడో' చిత్రాన్ని థియేటర్లతో పాటు ఓటీటీల్లో ఒకేసారి విడుదల చేస్తే.. థియేట్రికల్ రన్ ద్వారా వచ్చే ఆదాయం ఆటోమేటిక్గా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలోనే ఆమె డిస్నీ హాట్ స్టార్ నిర్ణయాన్ని తప్పు బడుతోంది. ఈ విషయమై చట్ట ప్రకారం వెళ్లబోతుంది స్కార్లెట్. లా సూట్ వేయడంపై డిస్నీ హాట్ స్టార్ ఎలా స్పందిస్తుందో చూడాలి.హాలీవుడ్లో సూపర్ స్టార్ ఇమేజ్ ఉండి ప్రపంచ వ్యాప్తంగా ఫుల్ ఫాలోయింగ్ ఉన్న హీరోయిన్స్లో ఒకరైన ముద్దుగుమ్మ స్కార్లెట్. హీరోలకు సరి సమానంగా రెమ్యునరేషన్ ప్లస్ వాటా తీసుకుంటుంది. ఈ క్రమంలోనే 'బ్లాక్ విడో' సినిమా విషయంలో నిర్మాణ సంస్థ డిస్నీ హాట్ స్టార్ వాళ్లతో ఒప్పందం చేసుకుంది. కరోనా వల్ల సినీ రంగంతో పాటు ఇతర రంగాలన్నీ లాస్ అయిన సంగతి అందరికీ తెలిసిందే.ఈ క్రమంలోనే డిస్నీ హాట్ స్టార్ తన నిర్మాణ సారథ్యంలో వచ్చిన 'బ్లాక్ విడో' మూవీని థియేట్రికల్ ప్లస్ డిజిటల్ రిలీజ్ చేసేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. తద్వారా వచ్చే అమౌంట్ తో ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆలోచిస్తుందని సమాచారం. మారిన పరిస్థితుల వల్ల ప్రజెంట్ ఓన్లీ థియేట్రికల్ రిలీజెస్ పై ఆధారపడే పరిస్థితి అయితే లేదు. కాల పరిస్థితులను బట్టి డిజిటల్ ఓటీటీల్లోనూ చిత్రాలను తప్పక విడుదల చేయాల్సి ఉంటుంది.అమెరికన్ హాలీవుడ్ ఇండస్ట్రీ మాత్రమే కాదు ఇండియాలోని సినీ ఇండస్ట్రీస్ కూడా డిజిటల్ రిలీజెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలన్నీ ముందే తమ చిత్రాలను డిజిటల్ ఓటీటీస్ వేదికగా రిలీజ్ చేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ఇప్పటికే పలు చిత్రాలు టాకీసుల్లో విడుదలైన కొద్దిరోజుల్లోనే ఓటీటీల్లో రిలీజ్ అయ్యాయి. అసలే కరోనా వల్ల నిర్మాతలు వందల నుండి వేల కోట్ల వరకు నష్టపోయి ఉన్నారు.ఇలాంటి సమయంలో కేసులు.. అగ్రిమెంట్ లు అంటూ నిర్మాతలను ఇబ్బంది పెట్టడం భావ్యం కాదంటూ కొందరు ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. థియేట్రికల్ ప్రదర్శణ వల్ల వచ్చే మొత్తం గురించి చర్చించి ఎంతో కొంత మొత్తంను డిమాండ్ చేయడం కోసం ఆమె ఇలా కోర్టుకు వెళ్లిందనే ఆరోపణలు కూడా కొందరు చేస్తున్నారు.




# శతాధిక చిత్రాల హీరో శ్రీకాంత్ వారసుడితో దర్శకేంద్రుని ఎలివేషన్ ఆ లెవల్లో..!

'పెళ్లి సందఆ' చిత్రంతో టాలీవుడ్ లో సత్తా చాటాలన్న కసితో ఉన్నాడు శతాధిక చిత్రాల కథానాయకుడు శ్రీకాంత్ వారసుడు రోషన్. ఈ నవతరం హీరో ని దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు మరో స్థాయిలో ఎలివేట్ చేయాలన్న తపనతో పని చేస్తున్నారు. ఆర్కా మీడియా వర్క్స్- ఆర్.కె ఫిలిం అసోసియేట్స్ బ్యానర్స్ పై కె.కృష్ణ మోహన్ రావు సమర్పణలో కె. రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందుతున్న 'పెళ్లి సందఆ'తో మరోసారి మ్యాజిక్ ను రిపీట్ చేయాలన్నది ప్లాన్.ఈ చిత్రంతో రాఘవేంద్రరావు శిష్యురాలు గౌరి రోణంకి దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. తాజాగా చిత్రబృందం ఈ మూవీలో వశిష్ఠ పాత్రలో కె.రాఘవేంద్రరావు ని లాంచ్ చేస్తున్నామని రివీల్ చేశారు. రాఘవేంద్రుడు ఇంతకుముందు గెస్ట్ గా సింగిల్ షాట్ లో కనిపించినా.. మేకింగ్ విజువల్స్ గా కనిపించినా కానీ నటుడిగా తెరపై కనిపించలేదు. కానీ తొలిసారి రోషన్ చిత్రంతో నటుడిగా పరిచయం అవుతుండడం ఆసక్తికరం. ఇక రాఘవేంద్రరావు ఎలివేషన్ ఆ రేంజులోనే ఉంది మరి. ఇంతకీ అతడు రాఘవేంద్రుడేనా.. అల్ట్రా రిచ్ కింగ్ ఫిషర్ యజమాని విజయ్ మాల్యానా? అనే రేంజులో అతడి లుక్ సర్ ప్రైజ్ చేసింది. అలా బేస్ బాల్ ఆడుతూ ఎంతో స్టైలిష్ గా కనిపించారు దర్శకేంద్రుడు. నటుడిగా అతడు తనదైన ముద్ర వేస్తారనే నమ్మకాన్ని పెంచింది ఈ లుక్. ఇంతకాలం దర్శకుడిగా కొనసాగిన కె.రాఘవేంద్రరరావు నటుడిగా తెరపై ఎలా ఆవిష్కరించనున్నారో చూడాలన్న ఆసక్తి కూడా పెరిగింది. ఇక రోషన్ భుజాలపై చెయ్యేసి విజువల్స్ లో అలా స్టైలిష్ గా నడిచొస్తున్న తీరు ఆకట్టుకుంది. అలాగే రోషన్ తో పాటు నాటి పెళ్లి సందడి ఫేం దీప్తి భట్నాగర్ ఓ ఫోటోలో ఛమక్కున మెరవడం కొసమెరుపు.నాటి క్లాసిక్ సెన్సేషన్ మళ్లీ రిపీట్ చేస్తారా? 90లలో మ్యూజికల్ హిట్ చిత్రం 'పెళ్లి సందడి' మ్యాజిక్ ని తిరిగి నేటి పెళ్లి సంద-డితో రిపీట్ చేస్తారా? అన్నది ఆసక్తిగా మారింది. అప్పట్లో ఈ మూవీలో శ్రీకాంత్ సరసన కథానాయికలుగా నటించిన రవళి- దీప్తి భట్నాగర్ లను తెలుగు ఆడియెన్ ఇప్పటికీ మర్చిపోలేదు. అందునా ధీప్తి భట్నాగర్ నాటి యూత్ కి వెరీ స్పెషల్. దీప్తి నాభి సొగసును ఆ నాభి దిగువన మచ్చను కూడా అంత తేలిగ్గా మరువడం కష్టం. ఉత్తరాది బ్యూటీ ధీప్తి భట్నాగర్ ని అంత అందంగా ఆవిష్కరించారు దర్శకేంద్రుడు. దీప్తి నవ్వు ఇస్టయిల్ ప్రతిదీ మర్చిపోలేరు. ఇక ఈ మూవీకి కీరవాణి అందించిన సంగీతం అంతే పెద్ద అస్సెట్ అయ్యింది.1996లో పెళ్లి సందడి రిలీజైతే ఇప్పటికి శ్రీకాంత్ వారసుడు రోషన్ హీరోగా అదే టైటిల్ తో రాఘవేంద్రరావు సారథ్యంలో పెళ్లి సంద-డి తెరకెక్కుతోంది.

# సవితా పూనియా.. భారత్‌ను ఆదుకున్న గోల్‌కీపర్




హైదరాబాద్: టోక్యో ఒలింపిక్స్‌లో భారత మహిళల హాకీ జట్టు ఇవాళ ఆస్ట్రేలియాను ఓడించి సెమీస్‌లోకి వెళ్లి చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ఆ గేమ్‌లో గోల్ కీపర్ సవితా పూనియా ( ఃౠజఙ్ఠ ౢబఅఋ ) కీలకంగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో ఆమె 9 గోల్స్ సేవ్ చేసి ఇండియా విజయంలో ప్రత్యేక పాత్ర పోషించింది. దూకుడుగా గోల్‌పోస్టును అటాక్ చేస్తున్న ఆస్ట్రేలియన్లను సవితా పూనియా ధీటుగా అడ్డుకున్నది.సవితా పూనియా.. హర్యానాలోని సిర్‌సాలో ఉన్న హాకీ నర్సరీలో శిక్షణ పొందింది. సుందర్ సింగ్ కర్బా ఆమెకు కోచ్‌గా ఉన్నారు. స్వగ్రామం జోధ్కా నుంచి ఆమె ప్రభుత్వ బస్సులో ప్రయాణించేది. గోల్‌కీపర్ కిట్స్‌తో ఆమె కోచింగ్‌కు వెళ్లేది. బస్సు కండక్టర్లు ఎవరు ఆ గోల్‌కీపర్ కిట్‌ను తాకినా ఆమె నొచ్చుకునేది. ఇవాళ్టి మ్యాచ్‌లో ఆసీస్ ప్లేయర్ల నుంచి బాల్‌ను దూరంగా పెట్టేందుకే పునియా ఎన్నో ప్రయత్నాలు చేసింది.సవితా పూనియా తండ్రి ఓ ఫార్మసిస్టు. తాతయ్య రంజిత్ సింగ్ ఓ రైతు. అయితే హ్యాకీ మ్యాచ్ కామెంట్రీలను తాత రంజిత్ రేడియోలో వినేవారు. ఆ సమయంలో సవితా పూనియా ఆ ఆట గురించి తెలుసుకుంది. స్థానికంగా జరిగే పోటీలకు తాతతో కలిసి వెళ్లేది. నిజానికి ఫార్వర్డ్ లేదా మిడ్‌ఫీల్డర్ ప్లేయర్‌గా సవితా ఎదగాలనుకున్నది. కానీ తాత కోరిక మేరకు ఆమె గోల్‌కీపర్‌గా రూపుదిద్దుకున్నది.గోల్‌కీపింగ్ నేర్చుకుంటున్న రోజుల్లోనూ సవితా పూనియా ఫుట్‌వర్క్, ఆర్మ్, లెగ్ పొజిషన్స్ చురుగ్గా ఉ




ండేదని చిన్ననాటి కోచ్ కర్బా తెలిపారు. మిడ్‌ఫీల్డర్లు, ఫార్వర్డ్ ఆటగాళ్లతో ఆమె ఎప్పుడు ఎక్కువ సమయం గడుపుతుందని, ఎందుకంటే వారి ఆటశైలిని అర్థం చేసుకునేందుకు ఆమె ప్రయత్నించేది ఆ కోచ్ తెలిపారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**